RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



25 ఏప్రిల్ 2025 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:278






## ఉగ్రదాడికి నిరసనగా నేడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీ

ఢిల్లీ, ఏప్రిల్ 24 జమ్ము కశ్మీర్? పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఇందులో పాకిస్థాన్? ప్రధాన సూత్రధారని దుయ్యబట్టింది. ఇది నేరుగా ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించిన కాంగ్రెస్?, ఉగ్రదాడిపై సమగ్ర విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఐక్యంగా ఉండాల్సిన ఇలాంటి సమయంలో విభజనను ప్రోత్సహించేలా బీజేపీ వ్యవహరిస్తుందని విమర్శించింది.

జమ్ము కశ్మీర్? ఉగ్రదాడి నేపథ్యంలో కాంగ్రెస్ అత్యున్నత విధాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమైంది. ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ఆమోదించింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు పాల్గొన్నారు. ఈ మేరకు సీడబ్ల్యూసీ వివరాలను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్? వివరించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏప్రిల్? 25న దేశవ్యాప్తంగా కొవ్వత్తులతో ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలో ప్రారంభమయ్యే అమర్?నాథ్ యాత్ర నేపథ్యంలో భక్తుల భద్రతపై దృష్టి సారించాలని సూచించారు. "కాంగ్రెస్? డిమాండ్?ను అంగీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ అంశం తీవ్రత దృష్ట్యా దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరు కావాలని ఆశిస్తున్నాం. ఇది నేరుగా మన ఐక్యత, భద్రతపై దాడిగా భావించాలి. ఈ క్రమంలోనే దాడిపై అన్ని కోణాలపైనా సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించాం."మరోవైపు జమ్మూకశ్మీర్? ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం 6 గంటలకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన పార్లమెంటు భవనంలో ఈ భేటీ జరగనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఉగ్రదాడి ఘటన, తీసుకున్న చర్యలను కేంద్ర ప్రభుత్వం వివరించనుంది. ఉగ్రదాడి ఘటనపై అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేసిన నేపథ్యంలో ఈ భేటీ జరగనుంది. ఇప్పటికే ఈ భేటీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్ వివిధ పార్టీల నేతలతో మాట్లాడినట్లు సంబంధిత వర్గాలు చెప్పాయి

## కర్రెగుట్టలో భారీ ఎన్కౌంటర్

వార్తా 8 లో

## ఇది పర్యాటకులపై దాడి కాదు భారత్ పై దాడి

## ప్రధాని నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ, ఉగ్రవాది ఎక్కడ తల దాచుకున్న సరే వెతికి మరి శిక్షిస్తామని ప్రధానమంత్రి అన్నారు. ఉగ్రవాదులకు మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠినంగా శిక్షిస్తామని అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్ లోని మధుబనిలో ఏర్పాటుచేసిన కార్యక్రమం లో ప్రధాని పాల్గొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిపై నేరుగా స్పందించారు. అమాయకులైన ప్రజలను పొట్టన పేట్టుకున్న వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి.

ఈ ఉగ్రదాడి వెనుక ఉన్న వారు.. ఇందులో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది భారతీయులు విరిచేస్తారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు యావత్ భారత్ దృఢ సంకల్పంతో ఉంది

అమాయకులైన ప్రజలను ఉగ్రవాదులు అతికిరాత కంగా చంపేశారు. ఈ దుర్మార్గమైన దాడులకు తెగబడ్డవారు ఎక్కడున్నా తీసుకొచ్చి మట్టిలో కలిపేసే సమయం వచ్చింది. ముష్కరులు కలలో కూడా ఊహించని విధంగా వారిని శిక్షిస్తాం. ఇది పర్యటకులపై జరిగిన దాడి కాదు.. భారత్‌పై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. దాడులకు పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించు కుంటారు. అని ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన విదేశాల కు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియ జేశారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలిచారని ప్రధాని పేర్కొన్నారు. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## ఉగ్రవాదుల దాడులను ఖండించిన రేవంత్‌రెడ్డి






**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**జమ్ము కశ్మీర్ పహల్గామ్‌లో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి పలువురు మంత్రివర్గ సహచరులతో నిర్వహించిన సమావేశం ఉగ్రవాదుల దాడులను ఖండించింది.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర రాజనర్సింహ , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు , ధనసరి అనసూయ సీతక్క , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఇతర ప్రతినిధులతో జరిగిన సమావేశం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## తెలంగాణను ప్రపంచానికి రోల్ మోడల్ గా చూపడానికి భారత్ సమిట్ : టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్





**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి** భారత్ సమ్మిట్ ఏర్పాట్లను పర్యవేక్షించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథ్, తదితరులుభారత్ సమ్మిట్ కు 100 దేశాలకు పైబడిన ప్రభుత్వ అధినేతలు, ఎంపీలు, జాతీయ పార్టీల నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలతో కలిపి మొత్తంగా 450 మంది ప్రపంచవ్యాప్తంగా ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యే అవకాశం కాంగ్రెస్ మూల సిద్ధాంతాలు అయినా అహింసా సత్యం న్యాయం ప్రజాస్వామ్యం వంటి అంశాలపై చర్చ రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ దేశాలకు చెందిన ప్రతినిధులను వివిధ అంశాలపై రెండు రోజులపాటు చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం

## జమ్మూకశ్మీర్‌లో జల్లెడ పడుతున్న సైన్యం



శ్రీనగర్, ఏప్రిల్ 24 పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం సైన్యం వేట కొనసాగిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో అణువణువూ గాలిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో దేశంలోని పలు ప్రాంతాల్లో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు తదుపరి చర్యలు తీసుకునేందుకు కేంద్ర హోంశాఖ కూడా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రమూకలను మట్టుబెట్టేందుకు సైన్యం వేట సాగిస్తోంది. లోయలోని అనుమానిత ప్రాంతాలను జల్లెడపడుతోంది. పహల్గాం దాడిని సీరియస్‌గా తీసుకున్న కేంద్రం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చింది. దాడి జరిగిన క్షణం నుంచి వందల మందిని సైన్యం అదుపులోకి తీసుకుంది. జమ్మూకశ్మీర్ పోలీసులు, సైన్యం కలిసి ఆపరేషన్ ఏరివేత చేపట్టారు. బోర్డర్‌లో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెట్టారు. ఇటు చీమ అటు వెళ్లినా తెలిసేలా డేగ కళ్లతో పహారా కాస్తున్నారు. ఇలాంటి ఉద్రిక్తత పరిస్థితుల సమయంలో కూడా కొందరు ఉగ్రవాదులు పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి వచ్చేందుకు ప్రయత్నించారు. అలా వచ్చిన ఉగ్రవాదులను భారత్ సైన్యం తుపాకీగుళ్లతో గతం పలికింది. బోర్డర్‌లోనే వాళ్లను మట్టుబెట్టి వారి వద్ద నుంచి పాకిస్థాన్‌కు చెందిన కరెన్సీ, మారణాయుధాలు స్వాధీనం చేసుకుంది. ఇలాంటివి మరిన్ని జరగొచ్చనే అంచనాలతో పూర్తి అలర్ట్‌గా సైన్యం ఉంది. గురువారం జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్‌లో ఉగ్రవాదులకు భద్రతా దళాలకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక ఆర్మీ జవాన్ అమరుడయ్యాడు. బసంత్‌గఢ్‌లో జమ్మూ కాశ్మీర్ పోలీసులతో కలిసి సైన్యం సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించింది. ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో ఓ ప్రాంతంలో ఎటాక్ చేసింది. ఈ టైంలో జరిగిన కాల్పుల్లో జవాన్ అమరుడైనట్టు సైన్యం ప్రకటించింది. దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. వచ్చే ప్రజలను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అన్ని భద్రతా విభాగాలను అప్రత్తమం చేశారు. వచ్చే పోయే వారిపై గట్టి నిఘా పెట్టాలని సూచిస్తున్నారు. బస్‌స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్ల వద్ద కూడా భద్రత పెంచారు. హైదరాబాద్, తిరుపతి, ముంబై, చెన్నై ఇలా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు సాగుతున్నాయి. ఉగ్రదాడిలో దోషిగా నిలబడ్డ పాకిస్థాన్‌ను ఒంటరిని చేసేందుకు కేంద్రం మరిన్ని చర్యలు సిద్ధమవుతోంది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందం రద్దు లాంటి బోల్డ్ స్టెప్ తీసుకుంది. భారత్ తీసుకున్న మరో ఐదు కీలక నిర్ణయాలు పాకిస్థాన్‌కు ఊపిరి ఆడనీయకుండా చేస్తున్నాయి. ఇప్పుడు ఢిల్లీలోని పాకిస్తాన్ అత్యున్నత దౌత్యవేత్త సాద్ అహ్మద్ వారాయిచ్‌కు సమన్లు జారీ చేసింది. పర్సోనా నాన్ గ్రాటా నోట్‌ను అందజేసింది. 48 గంటల్లోనే దేశం విడిచి పెట్టి వెళ్లిపోవాలని మర్యాదగా చెప్పింది. ఓవైపు చర్యలు తీసుకుంటూనే దేశ భద్రత విషయంలో చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర హోంశాఖ చర్చలు జరుపుతోంది. భద్రతా విభాగాలు, రా చీఫ్, ఇతర ముఖ్యులతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమావేశమయ్యారు. ఇంకోవైపు అఖిలపక్ష సమావేశం కూడా జరుగుతోంది. అటు జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశాల తర్వాత మరిన్ని కీలక నిర్ణయాలు వెల్లడి అయ్యే అవకాశం ఉంది.

ప్రజాబలం

25 ఏప్రిల్ 2025 శుక్రవారం

# పొత్తుతో చిత్తయ్యేదెవరు?

గత లోక్‌సభ ఎన్నికలకు ముందు విడిపోయిన ఎఐఎడిఎంకె, బిజెపి పొత్తు ఒకటిన్నర సంవత్సరాల తర్వాత, 2026 ప్రారంభంలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరిగి ఏర్పర్చుకొనేందుకు రెండు పార్టీలు ముందడుగు వేస్తున్నాయి. 2021లో అధికారాన్ని కోల్పోయినప్పటి నుండి తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వస్తున్న ఎఐఎడిఎంకె డిఎంకె నేతృత్వంలోని కూటమిని అధికారం నుండి తొలగించే ప్రయత్నాలలో బిజెపితో చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్నది. మరోవంక, దక్షిణాదిన వ్యాప్తి చెందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించక పోవడంతో తమిళనాడులో బలం పెంచుకునేందుకు బిజెపి సైతం ఆత్రుతతో వ్యవహరిస్తున్నది.అయితే ఆ రెండు పార్టీలు తప్పనిసరి పరిస్థితులలో చేతులు కలుపుతున్నా ఆచరణలో పరస్పరం అవిశ్వాసంతో వ్యవహరిస్తున్నాయి. ఆయా పార్టీలలో సైతం పొత్తుకు సానుకూలమైన సంకేతాలు కనిపించడం లేదు.ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా విధానం వంటి అంశాలను దూకుడుగా లేవనెత్తడంతో పాటు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సంఘర్షణకు దిగడం ద్వారా 'తమిళ్ ప్రైడ్' ఆయుధంగా ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఓ విధంగా రాష్ట్రరాజకీయాలపై ఆధిపత్యంతో వ్యవహరిస్తున్న డిఎంకెను ఎదుర్కొనేందుకు అవసరమైన సైద్ధాంతిక, రాజకీయ పటుత్వం ఎఐఎడిఎంకె- బిజెపి కూటమిలో కనిపించడం లేదు. బిజెపితో తిరిగి పొత్తు పెట్టుకోవడంపై ఎఐఎడిఎంకెలో అసంతృప్తి గుసగుసలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చివరకు ఈ పొత్తులో కీలకంగా కనిపించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం ఒత్తిడులు ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తున్నది. ఆయన మద్దతుతోనే బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఏకపక్షంగా వ్యవహరిస్తూ, అన్నాడిఎంకెను మాత్రమే కాకుండా పార్టీలో కీలక నేతలను సైతం దూరం చేసుకున్నారని తెలుస్తోంది. పొత్తు ప్రకటన కోసం చెన్నైకి రావడానికి రెండు రోజుల ముందు కొంతమంది బిజెపి కార్యకర్తలు ఢిల్లీ వెళ్లి ఆయనను కలిసి అన్నామలైను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని కోరితే ఆయన తీవ్రమైన ఆగ్రవేశాలు వ్యక్తం చేశారు.నాయకత్వం విషయం తమకు వదిలివేసి బూత్ స్థాయిలో పార్టీ పని చూసుకోండి అంటూ మందలించి పంపించారు. నాయకులపై ఫిర్యాదు చేయడానికి ఢిల్లీకి రావద్దని హెచ్చరించారు. అయితే, ఎఐఎడిఎంకెతో పొత్తు కోసం ఏప్రిల్ 10న అమిత్ షా చెన్నైకి వచ్చినప్పుడు, దాని నాయకుడు ఇ కె పళనిస్వామి విమానాశ్రయంలో తనకు స్వాగతం చెప్పేందుకు రాకపోవడంతో ఖంగుతిన్నారు. ఆ రోజు సాయంత్రం అనుకున్న ఎన్‌డిఎ మీడియా సమావేశం బిజెపి సమావేశంగా మారింది. దానితో వెంటనే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త గురుమూర్తి వద్దకు వెళ్లి సమాలోచనలు జరిపారు. ఆ వెంటనే అన్నామలై సైతం వెళ్లి ఆయనను కలిశారు.అన్నాడిఎంకె- బిజెపి పొత్తులో మొదటి నుండి గురుమూర్తి కీలక భూమిక నిర్వహిస్తున్నారు. ఆ తర్వాతనే రాష్ట్ర అధ్యక్షుడిని మార్చడం, మరుసటి రోజు మాజీ అన్నాడిఎంకె నేత నైనార్ నాగేంద్రన్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించిన తర్వాతనే పొత్తు ఖరారు చేస్తూ అమిత్ షా ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి పళనిస్వామి రావడం జరిగింది. అయితే ఆ తర్వాత తమ పొత్తు సీట్ల సర్దుబాటు వరకే అని, ఎన్నికల అనంతరం తాము ఏర్పాటు చేయబోయే మంత్రివర్గంలో బిజెపి ఉండబోదని పళనిస్వామి ప్రకటించడం గమనార్హం. అన్నాడిఎంకెతో పొత్తు ప్రకటించిన తర్వాత ఇటీవలి సంవత్సరాలలో బిజెపి వైపు ఉన్న మాజీ ఎఐఎడిఎంకె నాయకులు, మాజీ సిఎం ఓ పన్నీర్ సెల్వం, తన సొంత పార్టీ ఎఎంఎంకెకు నాయకత్వం వహిస్తున్న టిటివి దినకరన్ వంటి వారు ఈ కూటమికి దూరంగానే కనిపిస్తున్నారు. బిజెపి- ఎఐఎడిఎంకె కూటమి అటువంటి పార్టీలను ఎన్‌డిఎ కూటమిలో ఎలా తీసుకురాగలదో చూడాలి. చెన్నైలో తమ కూటమిని ప్రకటిస్తూ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిజెపి ఎఐఎడిఎంకె అంతర్గత విషయాలలో జోక్యం చేసుకోదు లేదా తొలగించిన నాయకులను తిరిగి చేర్చుకోవాలని వారిని అడగదు. ఎటువంటి జోక్యం ఉండదు అని స్పష్టమైన హామీ ఇవ్వాల్సి రావడం గమనార్హం. 2016 ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేసిన బిజెపి ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. దాని 188 మంది అభ్యర్థులలో ఎనిమిది మంది తప్ప మిగిలిన వారందరూ డిపాజిట్లు కోల్పోయారు. 2.8% వద్ద, బిజెపి ఓట్ల వాటా 2011 ఎన్నికలలో పొందిన 2.2% నుండి స్వల్పంగా మాత్రమే పెరిగింది. అంతకు ముందు లోక్ సభ ఎన్నికలకు మాత్రమే పరిమితమైన ఎఐఎడిఎంకె- బిజెపి పొత్తు మొదటిసారిగా 2021లో అసెంబ్లీ ఎన్నికలకు విస్తరించింది. దానితో మొదటిసారిగా బిజెపి నాలుగు సీట్లు గెల్చుకోగలిగింది. ఆ పార్టీ రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను గెలుచుకోవడం ఇది మూడోసారి మాత్రమే. ఎఐఎడిఎంకె సీట్ల సంఖ్య 66కు పడిపోయింది. చాలా సీట్లలో పోటీ చేసిన ఎఐఎడిఎంకె తన ఓట్ల వాటాను 33.3%కి తగ్గించుకుంది. అయితే, కేవలం 20 సీట్లలో పోటీ చేసినప్పటికీ బిజెపి ఓట్ల వాటా స్వల్పంగా 2.6%కి పడిపోయింది. సెప్టెంబర్ 2023 లో, ఎఐఎడిఎంకె నాయకత్వంపై అన్నామలై చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య సంబంధాలను తెంచుకొనే వరకు వెళ్లడంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేశాయి. డిఎంకె నేతృత్వంలోని ఇండియా బ్లాక్ రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం ద్వారా తన ఆధిపత్యాన్ని కొనసాగించడంతో వారిద్దరూ ప్రభావం చూపలేకపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను అసెంబ్లీ స్థాయిలో పరిశీలిస్తే, ఒక్క సీటు కూడా గెలవలేకపోయినప్పటికీ, బిజెపి 59 సెగ్మెంట్లలో రెండవ స్థానంలో, 64 సెగ్మెంట్లలో మూడవ స్థానంలో నిలిచింది. వీటిలో, బిజెపి 56 అసెంబ్లీ సెగ్మెంట్లలో 20 శాతం కంటే ఎక్కువ ఓట్లను, 20 సెగ్మెంట్లలో 30 శాతం కంటే ఎక్కువ ఓట్లను సాధించింది. ఆ బలంతోనే వచ్చే ఎన్నికలలో తన ఉనికిని మరింతగా పెంచుకునేందుకు బిజెపి ఉత్సాహ పడుతున్నది. తమిళ పార్టీలు తమ సైద్ధాంతిక పటుత్వం కోల్పోయాయని, దానితో ఇప్పుడు జాతీయ రాజకీయ పార్టీలకు తమిళనాడులో అనువైన వాతావరణం ఏర్పడుతున్నదని తుగ్లక్ సంపాదకుడు ఎస్ గురుమూర్తి భావిస్తున్నారు. అందుకనే అన్నాడిఎంకె- బిజెపి కూటమిని తమిళ ప్రజలు ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.అయితే, జయలలిత మరణం తర్వాత అన్నాడిఎంకె శ్రేణులు అందరినీ ఉమ్మడిగా తీసుకెళ్లగల నాయకత్వం ఆ పార్టీలో కనిపించడం లేదు. మరోవంక బిజెపిని 'తమిళ్ వ్యతిరేక' పార్టీగా ప్రజలు చుస్తున్నారని, అందుకనే ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని దెబ్బ తిన్నామని గతంలో ఆ పార్టీ నాయకులు బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి వ్యవహారం సైతం బిజెపిని 'తమిళ వ్యతిరేక' పార్టీగా చూపే ప్రయత్నాలకు ఊతం కలిగిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ రెండు సార్లు ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పడవేయడం ద్వారా సుప్రీం కోర్టు ద్వారా చివాట్లు తిన్న తర్వాత కూడా ఆయన వైఖరిలో మార్పు కనిపించడం లేదు. ఆ బిల్లుల్లో ఒక బిల్లు విశ్వవిద్యాలయాల వ్యవహారాలలో గవర్నర్ పాత్ర నామమాత్రమే అని స్పష్టం చేస్తుంది. ఏప్రిల్ 16న అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమావేశం నిర్వహించారు. అయితే విశ్వవిద్యాలయాలపై ముఖ్యమంత్రి కన్నా తానే అధికుడని సంకేతం ఇచ్చేందుకు ఏప్రిల్ 25 నుండి మూడు రోజుల పాటు ఊటీలో అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సమావేశం ఏర్పాటుచేసి, దానికి స్వయంగా ఉపరాష్ట్రపతి జగదేవ్ ధంకర్‌ను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఈ విధంగా సమావేశం ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు తీర్పు ధిక్కారమే అంటూ కేవలం డిఎంకే కూటమిలోని పక్షాలే కాకుండా అన్నాడిఎంకె,- బిజెపి కూటమిలోని పక్షాలు సైతం ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తున్నాయి. చివరకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు సైతం గవర్నర్ చర్యను సమర్థింపలేకపోతున్నారు. గవర్నర్ చర్యలు రాజకీయంగా డిఎంకె కూటమికి బలం చేకూరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకనే తక్షణమే గవర్నర్‌ను మార్చాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవంక, అన్నామలైని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకురావడం ద్వారా తమిళ రాజకీయాల్లో కీలక వ్యక్తిగా కొనసాగించాలంటూ అమిత్ షా చేస్తున్న ప్రయత్నాలు సైతం ఈ కూటమి సయోధ్యకు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పరస్పర వైరుధ్యాల మధ్య ఈ కూటమి వచ్చే ఏడాది ఎటువంటి ఫలితాలు సాధించగలదో చూడాల్సి ఉంది.

# ఉగ్రవాదుల దాడిలో మరణించిన 28 కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం




**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** అనంత్ నాగ్ జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రం పహెల్గం లో పర్యాటకులపై ఉగ్రవాదులు కొనసాగించిన పాశవిక దాడిని,నరమేధాన్ని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నాము.దాడిలో మరణించిన 28 కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నాము. ఇది మానవత్వం పై జరిగిన దాడిగా భావిస్తున్నాము.

విచక్షణ వివేకం ధ్యేయం లేని ఉగ్ర ముఠాలను కఠినంగా కట్టడి చేయాలని కోరుతున్నాము.

ఈ దాడి దేశ ప్రతిష్టను,భిన్నత్వంలో ఏకత్వం వారసత్వంతో జీవిస్తున్న ప్రజల సామరస్యత సహజీవన విలువలకు విఘాతం కలిగించే చర్యగా భావిస్తున్నాము.

దేశ విదేశీ పర్యాటకులకు ఆహ్లాదాన్ని ఆనందాన్ని ఇచ్చే స్వర్గ ధామంగా నిలిచే కాశ్మీర్ లో ఇలాంటి ఘటనలకు చోటు లేకుండా వేయాలి.ప్రపంచ జ్యోతి శాంతి దూత బుద్ధుడు బోధించిన కరుణ దయ జ్ఞానాలతో అశోకుడు కాశ్మీరాన్ని నిర్మించారు.ఇది భారత ప్రజల సమష్టి సంపద అని ,కుల మతాలకు అతీతంగా అపురూపంగా కాపాడుకోవాలని పిలునిస్తున్నాము.

ఉగ్రవాద కల్లోల చర్యలు పర్యాటక ప్రాంత ప్రజల జీవనోపాధిని దెబ్బ దీస్తుంది. ఇది అంతిమంగా దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టివేస్తాయి. ఇలాంటి క్రూర చర్యలు మళ్లీ తలెత్తకుండా చూడాలని ప్రభుత్వాలను కోరుతున్నాము.ప్రజలంతా ఈ అమానుష ఘటనకు ముక్త కంఠంతో ఖండించాలని కోరుతున్నాము.శాంతియుత సహజీవనం కు ఇబ్బందులు కలిగించే ఉగ్ర ముఠాల మూలాలను దెబ్బతీయాలని కోరుతూ చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని టీజీవో భవన్లో 2 నిమిషాలు మౌనం పాటించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో

ఏలూరి శ్రీనివాసరావు

అధ్యక్ష్యుడు,

ఏనుగు సత్యనారాయణ

ప్రధాన కార్యదర్శి,

బి శ్యాం అసోసియేట్ ప్రెసిడెంట్,

తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం మరియు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్

రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

డాక్టర్ కే రామారావు, శిరీష, లక్ష్మణ్ గౌడ్ , అక్తర్ అలీ, రాఘవేందర్ రాజ్, దేవేందర్, డాక్టర్ ఉమా శ్రీనివాస్, డాక్టర్ నరసింహ, డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.




**సనత్‌నగర్ ప్రజాబలం ప్రతినిధి** అనంత్ నాగ్ జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రం పహెల్గం లో పర్యాటకులపై ఉగ్రవాదులు కొనసాగించిన పాశవిక దాడిని,నరమేధాన్ని ఖండిస్తూ మరణించిన 28 కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నా మని సనత్‌నగర్ బీజేపీ కమిటీ ప్రకటించింది

# వరంగల్‌లో గులాబీ మాస్ జాతరకు భారీ ఏర్పాట్లు




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఏప్రిల్ 24 తెలంగాణలో పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు బిఆర్ ఎస్ పార్టీ సిద్ధమయ్యింది. వరంగల్ జల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27వ తేది జరగబోయే ఈ సభకు గతంలో ఎన్నడూ లేనివిధంగా జన సమీకరణ చేపట్టింది. అందుకే అదేస్థాయిలో ఏర్పాట్లను సైతం చేస్తోంది గులాబీ దళం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా 25ఏళ్ల క్రింత ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ ఎస్ ), రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించడంతోపాటు దాదాపు దశాబ్దకాలం నూతన రాష్ట్రాన్ని పాలించి చరిత్ర సృష్టించింది. దేశ రాజకీయాల్లో? చక్రం తిప్పాలనే వ్యూహంతో టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చుకున్న గులాబీపార్టీకి అధికారం దూరమైంది. ఇప్పుడు ఏర్పాటు చేయబోతున్న ఈ భారీ సభ అత్యంత కీలకంగా మారింది. ఓటమి తరువాత ప్రజాసమస్యలపై విమర్శలకు కాస్త గ్యాప్ తీసుకున్న కేసీఆర్, వరంగల్ రజతోత్సవంలో మరోసారి తన మార్క్ వ్యూహాత్మక రాజకీయ విమర్శలతో అధికారపార్టీకి చుక్కలు చూపించేందుకు సిద్ధమైంది. వరంగల్ లో ఈనెల 27వ తేది జరగనున్న వేడకులకు గులాబీ శ్రేణులు ఆశగా ఎదురు చూస్తున్నాయి. తెలంగాణవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పదిలక్షల మందికి తక్కువ కాకుండా సభకు తరలించేందుకు బిఆర్ ఎస్ కార్యకర్తలు నిర్విరామంగా శ్రమిస్తున్నారు. ఇప్పటికే ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ, బొట్టుపెట్టి మరీ వరంగల్ సభకు రావాలంటూ ఆహ్వానిస్తున్నారు. 1213 ఎకరాల్లో సభా ప్రాంగణం సిద్ధం చేశారు. లక్షలాదిగా జనం హాజరైనప్పటికీ ఎవరెక్కడ కూర్చున్నా వేదికపై జరుగుతున్న వేడుకలు, కేసీఆర్ ప్రసంగం సభాప్రాంగణం మొత్తం క్లారిటీగా కనిపించే విధంగా ఎల్ ఈడీ స్క్రీన్ లు ఏర్పాటు చేశారు. ఎండలు దంచికొడుతున్న వేళ సభా ప్రాంగణం మొత్తం చల్లటి వాతావరణం ఉండేలా టెంట్లు, కూలర్లతోపాటు అత్యాధునిక టెక్నాలజీని వాడిని ఎండవేడి నుంచి కార్యకర్తలకు రక్షణ కల్పించేలా సర్వం సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేడుకలు జరిగే అవకాశం ఉండటంతో ఎండ వేడిని తట్టుకునేందుకు 10లక్షల మజ్జిగ ప్యాకెట్లు పంచేందేందుకు ఏర్పాట్లు చేశారు. తాగునీటికి సమస్య లేకుండా ఏకంగా 10లక్షల వాటర్ బాటిల్స్ తెప్పించారు. ఇంకా అవసరమైతే వాటర్ బాటిల్స్ తెచ్చేందుకు గులాబీ టీమ్ సిద్ధమైంది. బీఆర్ఎస్ రజతోత్సవం కోసం తెలంగాణ నలుమూలల నుంచి వేలాదిగా వాహనాలు తరలి వస్తాయి అందుకే పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఏకంగా పార్కింగ్ కోసం వెయ్యి ఎకరాలు కేటాయించారు. వాహనాలు పార్కింగ్ చేసుకుని, నేరుగా సభాప్రాంగణం వద్దకు చేరుకునేలా, తొక్కిసలాటకు అవకాశం లేకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఒకేసారి వేదికపై 500 మంది బీఆర్ ఎస్ నాయకులు కూర్చునేలా అత్యంత భారీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. కేసీఆర్ , కేటీఆర్ లతో సెల్ఫీలు దిగే ముచ్చట తీర్చేందుకు ప్రత్యేకంగా సభా ప్రాంగణంలో సెల్ఫీ బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యుత్ కోతల ప్రభావం ఈ ప్రభుత్వంలో ఎక్కువగా ఉందని , తమకు విద్యుత్ సరఫరా పై నమ్మకంలేదంటూ ఏకంగా 200 జనరేటర్లను సిద్ధం చేశారు. అనారోగ్య సమస్యలు, వడదెబ్బ వంటివి తలెత్తినప్పుడు వెంటనే వైద్య సదుపాయం అందించేందు 100కి పైగా వైద్య బృందాలను సభప్రారంగణంలో అందుబాటులో ఉంచారు. అత్యవసర సమయంలో వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించేందకు 20 అంబులెన్స్ లు సైతం ఏర్పాటు చేశారు. తాత్కాలిక టాయిలెట్స్, సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునేందుకు 2వేలమంది వాలంటీర్లను అందుబాటులో ఉంచారు. ఇలా చెప్పుకుంటే పోతే బీఆర్ ఎస్ రజతోత్సవాన్ని ఓ మహా?జాతరలా జరిపేందుకు గులాబీ

# హనుమకొండ లో బీఆర్ఎస్ సంతాప, శాంతి ర్యాలీ



**హనుమకొండ ప్రజాబలం ప్రతినిధి** జమ్మూ కశ్మీర్ పహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రవాద దాడిలో అమాయక పర్యాటకుల ప్రాణనష్టం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. భారతమాత బిడ్డలైన 28 మంది పర్యాటకులు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరం. ఈ దారుణ ఘటనపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, హనుమకొండ జిల్లా భారత రాష్ట్ర సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ రోజు (24-04-2025, గురువారం) సాయంత్రం 6:30 గంటలకు బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం నుండి సుబేదారి అమరవీరుల స్తూపం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ గారు హాజరై అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ గారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మత విద్వేషాలు రెచ్చగొట్టే ఉగ్రవాదుల కుట్ర ఇది. కశ్మీర్‌లో జరిగినా దాని ప్రకంపనలు అన్ని రాష్ట్రాల్లో గుబురుపుట్టిస్తున్నాయి. అమాయకులపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత బాధాకరం. భారతీయుల ఐక్యతను దెబ్బతీసేందుకు ఉగ్ర మూకలు ప్రయత్నిస్తున్నా, మన ప్రజలు శాంతియుతంగా, ఐక్యంగా ఎదుర్కొనాలి. భారతీయుల ఆత్మస్థైర్యాన్ని ఎలాంటి దొంగదెబ్బలతోనూ దెబ్బతీయలేరు. దేశ భద్రతకు ముప్పుగా మారుతున్న ఇటువంటి ఘటనలపై కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

# మలేరియా రహిత ఇండియా సాధ్యమా?

ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల ప్లాస్మోడియం అనబడే పరాన్న సుక్ష్మ జీవి మానవ రక్తంలోకి చేరి మలేరియా వ్యాధికి కారణం అవుతుంది. చికిత్సను అశ్రద్ధ చేయడం ప్రాణాంతకం కూడా కావచ్చు. ప్రపంచాన్ని వణికించిన ప్రాణాంతక వ్యాధుల్లో మలేరియా కూడా ఒకటి. నేటికీ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మలేరియా వ్యాధి పేద బడుగు బలహీన వర్గాలను పట్టి పీడిస్తున్నది, ప్రాణాలను సహితం తీస్తున్నది. అధ్యయన వివరాల ప్రకారం ప్రతి ఏట ప్రపంచవ్యాప్తంగా 229 మిలియన్ల కొత్త మలేరియా కేసులు బయట పడుతున్నాయి. నేడు ఐరాస గుర్తింపు పొందిన మలేరియా రహిత దేశాల జాబితాలో జపాన్, యూఏఈ, శ్రీలంక లాంటి దాదాపు 45 దేశాలు సగర్వంగా కనిపిస్తున్నాయి. నేటి డిజిటల్ యుగంలో సహితం దాదాపు వందకు పైగా దేశాల 3.3 బిలియన్ల ప్రజలు మలేరియా అంచున కొట్టుమిట్టాడుతుండడం విచారకరం. ఆఫ్రికా దేశాల్లోనే 93 శాతం మలేరియా కేసులు, 94 శాతం మలేరియా మరణాలు నమోదు అవుతున్నట్లు అంచనా. ఐరాస నాయకత్వంలో 2007 నుంచి ప్రతి ఏట 25 ఏప్రిల్ రోజున "ప్రపంచ మలేరియా దినం (వరల్డ్ మలేరియా డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 వరల్డ్ మలేరియా డే ఇతివృత్తంగా "మలేరియా నిర్మూలన దిశగా రీఇన్వెస్ట్, రీఇమేజింగ్, రీఇగ్నైట్" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. 2000 సంవత్సరం నుంచి మలేరియా వ్యాధి నిర్ధారణ, మెరుగైన చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగ నిర్మూలన వంటి ఇతర విషయాల్లో వచ్చిన విప్లవాత్మక సానుకూల మార్పులతో మలేరియా నుంచి ప్రజలను కాపాడడం తేలిక అయ్యింది. గత రెండు దశాబ్దాలుగా 7 మిలియన్ల మలేరియా వ్యాధిగ్రస్థులను కాపాడడంతో పాటు ఒక బిలియన్ ప్రజలకు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం విజయవంతంగా జరిగింది. ప్రపంచ దేశాలను "జీరో మలేరియా" దేశాలుగా ప్రకటించడానికి కావలసిన కృషి నిరంతరం కొనసాగుతున్నది. మలేరియా నిర్మూలన సదుద్దేశంతో ప్రపంచ దేశాలు వడి వడిగా సరైన దిశలో అడుగులు వేయడం, మలేరియాను నియంత్రించడం, మరణాలకు అడ్డుకట్ట వేయడం ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా జరుగుతోంది. మలేరియా కట్టడికి పౌర సమాజంతో పాటు ప్రభుత్వాలు కూడా నడుం బిగిస్తేనే ప్రయోజనం ఉంటుందని గమనించాలి. దోమల నిర్మూలన, పరిసరాల శుభ్రత, వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స, నిధుల కేటాయింపు, సామాన్య ప్రజలకు అవగాహన లాంటి చర్యలతో మలేరియా నియంత్రణ సుసాధ్యం కావడం మన అనుభవంలోకి వస్తున్నది. మలేరియా వ్యాధి లక్షణాల్లో జ్వరం, చలి వణుకు, చెమట, తల నొప్పి, అలసట, కండరాల కీళ్ల నొప్పులు, వాంతులు, రక్తహీనత, దగ్గు, కడుపు నొప్పి లాంటివి ఉన్నాయి. డిజిటల్, ఏఐ-ఎంఎల్ యుగంలో వేగంగా దూసుకుపోతున్న నవ్య మానవుడు దోమకాటు కారణంగా వచ్చే మలేరియా కోరల్లో చిక్కుకోవడం సోచనీయం. దోమకాటు బారినపడకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సోకినపుడు వెంటనే వైద్య చికిత్స తీసుకోవడం మన కనీస కర్తవ్యం. ఈ విషయంలో పౌరులు, వైద్య సిబ్బంది, ప్రభుత్వ చర్యలు లాంటివి సమాంతరంగా జరిగితేనే భారతం మలేరియా రహిత దేశాల జాబితాలో చేరుతుందని తెలుసుకుందాం.

## దేశవిదేశాల్లో రాణించిన టంగుటూరి

భానుమతి వలెనే టంగుటూరి సూర్యకుమారి కూడా బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నాట్యకారిణి, నటి, గాయని మాత్రమే కాదు మంచి వక్తగా కూడా గుర్తింపు తెచ్చుకుంది, తెలుగు పాటని, తెలుగు భాషని, భారతీయ నృత్యాలను స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పొందడానికి ఆవిడ చేసిన కృషి అపూర్వం. అనన్య సామాన్యం. ప్రాచ్య, పాశ్చాత్య నృత్య, సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తినందిన మధురగాయని ఆమె. టంగుటూరి సూర్యకుమారి (నవంబర్ 13, 1925 – ఏప్రిల్ 25, 2005) అలనాటి తెలుగు సినిమా నటి, ప్రసిద్ధ గాయకురాలు. ఆమె నవంబర్13,1925లో రాజమండ్రిలో జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు తమ్ముడు టంగుటూరి శ్రీరాములు కూతురు. మూడో ఏటనుంచే పాటలుపాడేది. 1937లో మద్రాసు చేరుకుని, పన్నెండు, పదమూడేళ్ళ ప్రాయంలోనే సినీరంగ ప్రవేశము చేసి, 'రైతుబిడ్డ' సినిమాలో నటించింది. 1952లో ఆమె తొలి మద్రాసు అందాల సుందరి (మిస్ మద్రాసు)గా ఎంపికైంది. సూర్యకుమారి రూపం, కంఠస్వరం రెండూ బాగా ఉండడంచేత, అప్పటికే పెదనాన్న ప్రకాశం సభల్లో ప్రార్థన గీతాలు పాడుతూండడం చేత సినిమావారి పిలుపు వచ్చింది. సాంప్రదాయ నియమ, నిష్ఠలుగల కుటుంబం కావడం చేత కొంత వ్యతిరేకత ఎదురయ్యింది. సూర్యకుమారి కంఠం, రంగూ, రూపం ఆకర్షణీయంగా ఉన్నా, మామూలు అమ్మాయిల కంటే కొంచెం పొడవుగా ఉండటం చేత, సినిమా రంగంలో సమస్య ఎదురైంది. ఆనాటి సగటు హీరోలు ఆమె కంటే పొట్టిగా ఉండటం కారణం. అదీ కాక ఆమె బ్రాహ్మణ, పేరుపొందిన రాజకీయ కుటుంబం నుంచి రావటమే కాదు, ప్రేమ సన్నివేశాలలో హీరోయిన్ మీద హీరో చెయ్యి వెయ్యడం, ఇత్యాదివి ఒప్పుకొనేవారు కాదు. గొప్ప చాతుర్యం ఉండి కూడా ఆమె సినిమాల్లో సుస్థిరత పొందలేక పోయింది. అయినా సూర్యకుమారి సినిమాల్లోకి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ నాలుగు భాషల్లోనూ మొత్తం ఇరవై ఆరు సినిమాల్లో నటించింది. విప్రనారాయణ' ఆమె తొలిచిత్రం. అదృష్టం, జయప్రద దేవత, చంద్రహాసన, దీనబంధు. భక్తపోతన, భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, గీతాంజలి, అదృష్టదీపుడు, మరదలి పెళ్లి, భక్త రామదాసు తదితర తెలుగు చిత్రాల్లో 'ఉడన్', 'ఖటోలా' తదితర హిందీ చిత్రాల్లో, 'కటకం', 'సేంసారనౌక మొదలైన తమిళ చిత్రాల్లో నటించింది. అలాగే కన్నడ చిత్రం భారతిలో', ఆంగ్ల చిత్రం 'బాంబే మయిటి లోనూ నటించింది. సూర్యకుమారి, లండన్లో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తూ, కాళికాదేవిగా నాటకాల్లో నటించేది. లలిత గీతాలు యాభై, దేశభక్తిగీతాలు యాభై మొత్తం నూరు గ్రామఫోను రికార్డులు ఇచ్చింది. అలాగే ఒక యాభై దాకా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాల్లో తన గొంతుతో పాడిన పాటల రికార్డులు ఉన్నాయి. నటన కంటే సూర్యకుమారి పాడిన దేశభక్తి గీతాలు, లలితగీతాలు, అష్టపదులు వంటివాటికే ఎక్కువ ప్రజాదరణ లభించడంచేత ఆమె పాట కచ్చేరీలు తరుచూ చేస్తూండేది. ఆంధ్రలోని చాలా ఊళ్ళలో లలిత సంగీత కచ్చేరీలు చేసింది. పేరు ప్రతిష్టలు, ప్రజాదరణ ఆమెకు తృప్తినివ్వలేదు. ఏదో ప్రత్యేక కృషి చెయ్యాలన్న తపన, మూడు నాలుగేళ్ళపాటు కరతాళ ధ్వనులకు, ప్రశంసలకు దూరంగా ఉండి, చదువుమీద దృష్టి కేంద్రీకరించి, ప్రైవేటుగా కేంబ్రిడ్జి సీనియర్ పరీక్ష వ్రాసి, ప్రథమశ్రేణిలో పాసైంది. పలు భాషా చిత్రాలలో నటించిన సూర్యకుమారి మంచి గాయకురాలు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయములో మా తెలుగు తల్లికి మల్లెపూదండ, దేశమును ప్రేమించుమన్నా మొదలైన అనేక దేశభక్తి గీతాలు పాడింది. ప్రకాశం పంతులు ఆమె కళాభిరుచిని బాగా ప్రోత్సహించి, శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. ఆయన ఏ సభకు వెళ్ళినా ఆమెను తీసుకెళ్ళి జాతీయ గీతాలు పాడించేవాడు. 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రావతరణ సభలో నెహ్రూ, రాజాజీ, ప్రకాశం ప్రభృతుల సమక్షంలో , వందే మాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ పాటలు ఆలపించి అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వీటితో పాటు 'స్వప్నజగతిలో ఛాయావీణ' మొదలైన లలిత గీతాలు, అడవి బాపిరాజు 'ప్రభువుగారికీ దణ్ణం పెట్టు', 'రావోయి చిన్నవాడా' మొదలైన జానపద గీతాలు కూడా పాడుతుండేది. హెచ్.ఎం.వి. తదితర గ్రామఫోన్ కంపెనీలు ఈమె పాటలను రికార్డు చేశాయి. ఆమె పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులుగా వెలువడి విరివిగా అమ్ముడు పోయేవి. ప్రత్యేకంగా రాయించుకున్న పాటలు ఆమెతో పాడించి మరీ గ్రామఫోన్ రికార్డులుగా తీసుకురావడానికి అప్పటి గ్రాంఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. విశేష ఆసక్తి ప్రదర్శించేది, అలా ఆమె పాడిన పాటల్లో జాతీయ గీతాలు, భావగీతాలు, అష్టపదులు ఇలా చాలా రకాలు ఉన్నాయి. శంకరంబాడి సుందరాచారి రచించిన 'మా తెలుగుతల్లికి మల్లె పూదండ..' పాటని ఆమె పెదతండ్రి టంగుటూరి ప్రకాశం పంతులుతో వివిధ రాజకీయ సభల్లో పాడి ప్రాచుర్యం తెచ్చింది. ఆ సభల్లో వక్తగానూ ఆమెకు పేరుండేది.

వెండి కంచాలలో వేడి బువ్వుందోయ్, పసిడి కంచాలలో పాల బువ్వుందోయ్, తిందాము రావోయ్ జాబిలి, ఆడుకుందాము రావోయ్ జాబిలీ' అంటూ నటిస్తూ పాడిన 'దేవత' చిత్రంలోని పాట, నారదుడుగా 'శ్రీకృష్ణ ప్రేమ'లో నటిస్తూ 'రేపే వస్తాడంట గోపాలుడు మాపే వస్తాడంట గోపాలుడు...' ఇలా చాలా పాటలు ప్రజాదరణ పొందాయి. 1958లో భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధుల బృందంలో ఒక ప్రతినిధిగా అమెరికాను సందర్శించి, తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంది. అలా వారితో ఏర్పడిన సంబంధాలు 1959లో కొలంబియా యూనివర్సిటీ ట్యూటర్ గా వెళ్ళి, పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య నృత్యాల్లో శిక్షణ పొంది వచ్చింది. సూర్యకుమారి ఆ రోజుల్లోనే హాలీవుడ్ కి వెళ్లి ప్రముఖ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ వద్ద పని చేసింది. ఇంగ్లండ్లో సిరపడి ప్రముఖ పెయింటర్ హెరాల్డ్ ఎల్విన్ ను వివాహం చేసుకుని ఇండియా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' అనే సంగీత నాట్య పాఠశాలను నిర్వహించింది. ఇందులో భారతీయ పాశ్చాత్య కళలను, కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పరస్పర సదవగాహన పెంపొందించం ముఖ్య ఆశయం. 1968లో ఆమె కృషిని బ్రిటిష్ రాణి గుర్తించింది. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళు లర్పిస్తూ సెయింట్ పాల్ కెథెడ్రల్ లో గానం చేసిన ప్రథమ భారతీయ వనిత ఆమె. నార్వే, స్వీడన్, హాలెండ్, స్పెయిన్, కెనడా, అమెరికా మొదలైన పలు దేశాలలో భారతీయ సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి, వందలాది కళాకారులను తయారు చేసింది. అమెరికాలో బ్రాడ్వే థియేటరులో విశ్వకవి రవీంద్రుని 'కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో రాణి పాత్ర ధరించి, బ్రాడ్వే అవార్డు పొందిన మొదటి భారతీయ నటి. ఆ నాటకాన్ని న్యూయార్కులో ఎనిమిది నెలలపాటు ప్రదర్శించి, అటు తరువాత ఆఫ్రికాలో నాలుగు నెలలు పర్యటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసి 'ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో నటించింది. ఆ నాటకానికి దేశ విదేశాలలో విశేష ఆదరణ లభించడమే కాకుండా విదేశీయుల అభిమానాన్ని కూడా చూర గొ నే అవకాశం కలిగింది. కొలంబియా యూనివర్సిటీలో, లండను యూనివర్సిటీ విద్యాసంస్థలలో, బ్లాక్ థియేటర్లోను భారతీయ నృత్యకళ సంగీతంపై వర్క్ షాపులు నిర్వహించింది. 1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఆమె సేవలను గుర్తించి సత్కరించింది. 1979లో రాజ్యలక్ష్మి అవార్డుతో ఆమెను గౌరవించింది.

ఆమె ఏప్రిల్ 25, 2005 న లండనులో మరణించింది.

# రేడియో ఆవిష్కర్త మార్కోనీ

గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 – 1937 జూలై 20) ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితామహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్ తో కలసి వైర్?లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్?లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు. రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాద్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్?సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు.లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు.18 యేళ్ళ వయస్సులో అతను తిరిగి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు. 1890 ల ప్రారంభంలో, అతను "వైర్లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది. మార్కోనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా %జూాా% సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది.1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం (%ఎతీశీఓం ఖర్ఱఅశ్ర రీఅశీఅ%) పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు.1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది.బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.

## పెరుగుతున్న బంగారం ధరతో...
## స్వర్ణకారుల అవస్థలు

రాజమండ్రి , ఏప్రిల్ 24, బంగారం ధర లక్ష రూపాయలు దాటేసింది. పది గ్రాముల పసిడి త్వరలో లక్షా పాతికకు వెళ్తుందని అంచనా. బంగారం ధర ఆకాశాన్నంటుండటంతో మధ్యతరగతి ప్రజలు బంగారు వైపు చూసేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా బంగారు వస్తువులు చేయించుకోవడానికి గోల్డ్ స్మిత్ వర్కర్స్ దగ్గరికి రావడం మానేశారు. దీంతో ఉన్న వ్యాపారం పోయి గోల్డ్ స్మిత్ వర్కర్లు డీలాపడ్డారు. ప్రస్తుతం తమ పరిస్థితి దయనీయంగా ఉందంటున్నారు స్వర్ణకారులు.స్వర్ణకారులు సాధారణంగా బంగారం, వెండి తోపాటు ప్లాటినం వంటి లోహాలను ఉపయోగించి ఆభరణాలు, ఇతర అలంకరణ వస్తువులను డిజైన్ చేయడం, క్రాఫ్టింగ్ చేయడం, మరమ్మతు చేయడం, సవరించడం వంటి పనులను చేపడతారు. ఒక బంగారు వస్తువు తయారు చేయాలన్నా.. వస్తువు రీప్లేస్మెంట్ చేయాలన్న చాలా నిశిత దృష్టి అవసరం. అలాంటి స్వర్ణకారుడు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మెయిన్ రోడ్ లో 700కి పైగా బంగారు షాపులు ఉన్నాయి. ఇందులో వందలాది మంది స్వర్ణకారులు పనులు చేసుకుంటున్నారు.తాజాగా పెరిగిన బంగారం ధరలతో బంగారం కొనుగోలు చేయలేక మధ్యతరగతి వారు కూడా కనీసం షాపులకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే మమ్మలను ఆదుకోవాలని కోరుతున్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలు బంగారు ఆభరణాలు తయారు చేయడానికి తమ వద్దకు రాక పనులు లేక స్వర్ణకారులు షాపులు వెలవెలబోతున్నాయి. స్వర్ణకారుల షాపుల వద్ద పనులు లేక కొన్ని షాపులు మూసేస్తే మరికొన్ని షాపుల వద్ద ఖాళీగా పనిలేక నిరాశతో ఉన్నారు.బంగారు ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుంటే ప్రజలు మునుపటి కంటే తక్కువ బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. తత్ఫలితంగా, స్వర్ణకారులు ప్రతికూలంగా ప్రభావితమవుతున్నాయి అంటున్నారు. చాలా మంది చేతి వృత్తులవారి జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని, ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ స్వర్ణకారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో స్వర్ణకారులకు లోన్లు రాక.. ఇటు పనులు లేక కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని వాపోతున్నారు. బంగారం ధర పెరుగుదలతోపాటు.. పెద్ద పెద్ద లగ్జరీష్ బంగారం షాపులు వచ్చేయడంతో పనులు బాగా తగ్గిపోయిని వాపోతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని ఏదైనా భృతి ప్రకటించాలని కోరుతున్నారు రాజమండ్రి స్వర్ణకారులు.తూర్పుగోదావరి జిల్లాలో ఒక రాజమండ్రిలోనే వెయ్యి మందికి పైగా స్వర్ణకారులు ఈ సాంప్రదాయ వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఇక చుట్టుపక్కల స్వర్ణకారులైతే మరొక 3,000 నుంచి 4,000 మంది వరకు ఉంటారు. పూర్వపు ఉమ్మడి గోదావరి జిల్లాలో దాదాపు వేలాది మంది స్వర్ణకారులు పరిస్థితి ఇలాగే ఉందని అంటున్నారు. ఆభరణాల తయారీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రావడంతో ఈ వృత్తికి ప్రాధాన్యత తగ్గడం.. మరోవైపు బంగారు ఆభరణాలు రేటు అధికమవడం.. వెరసి సామాన్య స్వర్ణకారుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

# ఏపీ బీజేపీ ఛీఫ్ కోసం పోటీ..

విజయవాడ , ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్ష పదవికి భారీ స్థాయిలో పోటీ నెలకొంది. కూటమి అధికారంలో ఉంది. కేంద్ర ప్రభుత్వంలోనూ ఏపీ ఇంపార్టెన్స్ పెరిగింది. అమరావతి, పోలవరం నిర్మాణాలకు ప్రాధాన్యత దక్కుతోంది. ఈ కారణాలతో ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి గతంలో కంటే ప్రాముఖ్యమైందిగా మారిపోయింది. అందుకే ఈసారి ఎన్నడూ లేనంతగా ఆ పదవి కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రంలో ,కేంద్రంలో తమకున్న పలుకుబడి దృష్ట్యా ఎవరికీ వారు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు.ఇప్పటికే రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరికే మరోసారి ఆ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో బీజేపీ అధిష్ఠానం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. కేంద్రంలో కీలక పదవికి ఆమెను తీసుకు వెళ్లాలని భావించినా 2024 ఎన్నికల సమయంలో కీలకంగా ఆమె వ్యవహరించడం ఎన్టీఆర్ కుమార్తె అనే సెంటిమెంట్ ప్రజల్లో ఉండడం టిడిపి నేతలు, జన సైనికులు కూడా ఆమెతో గౌరవంగా ఉండడం పార్టీకి కలిసి వస్తుందని కేంద్ర స్థాయి నేతలు భావిస్తున్నారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేని పనితీరు మరోసారి కలిసి వచ్చే ఛాన్స్ ఉంది. ఇటీవలే ఆమె కుటుంబంతో నారా కుటుంబం కూడా కలిసిపోయిన పరిస్థితులు బేరీజు వేసుకుని పురందేశ్వరికే మరికొంత కాలం పార్టీ బాధ్యతలు అప్పజెప్పాలని కేంద్ర బీజేపీలోని ఒక వర్గం భావిస్తోంది.ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వ్యక్తుల్లో విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సత్యనారాయణ చౌదరి అలియాస్ సుజనాచౌదరి ఒకరు. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమి తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీలో చేరిన ఆయన అప్పటి నుంచి పార్టీకి నమ్మకంగా పని చేస్తూ వస్తున్నారు. ఆర్థికంగా సామాజికంగా బలమైన వ్యక్తి కావడంతోపాటు కేంద్ర స్థాయిలో పలుకుబడి కూడా గట్టిగానే ఉంది. 2024 ఎన్నికల్లో చాలా కీలకంగా వ్యవహరించిన ఆయనకు టిడిపి హైకమాండ్‌తో కూడా దగ్గర పరిచయాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇటీవల వైసీపీలో నుంచి బయటికి వచ్చిన ఒక కీలక నేత ఆ నిర్ణయం తీసుకునేలా చక్రం తిప్పింది సుజనా చౌదరే అని త్వరలోనే ఆ వ్యక్తి బిజెపిలో చేరతారని ఏపీ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ ప్రచారంలో వాస్తవం ఎంత ఉన్నా సుజనా చౌదరికి బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పజెప్పినట్లయితే పార్టీని బలోపేతం చేసేలా కీలక వ్యక్తులను ప్రముఖులను పార్టీ వైపు ఆకర్షించేలా చేయగల సమర్థత సుజనా చౌదరికి ఉందని ఆయన వర్గం చెబుతూ వస్తోంది. సుజనా చౌదరి కూడా ఆ దిశగా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారన్న సంకేతాలు అందుతున్నాయిబిజెపి ఈసారి రాయలసీమనేతకు రాష్ట్ర అధ్యక్ష పదవి కట్ట పెట్టాలంటే అది దక్కేది విష్ణువర్ధన్ రెడ్డికే. ఇప్పటికే ఆ దిశగా తన ప్రయత్నాలు తీవ్రతరం చేశారాయన. యువనేత కావడం ప్రత్యర్థులకు సీరియస్‌గా సమాధానం చెప్పడం పార్టీకి విధేయుడుగా ఉండడం ఇవన్నీ ఆయనకి కలిసి వచ్చే అంశాలు కాగా.. కాస్త దూకుడు స్వభావం చిక్కులు తెచ్చి పెడుతూ ఉంటుంది. కానీ ఎలాగైనా బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తన వంతు ప్రయత్నం ఆయన ముమ్మరంగా చేస్తున్నారు బీజేపీ కేంద్ర నాయకత్వం వద్ద అత్యంత పలుకుబడి గల వ్యక్తి. కేంద్ర విధానాలపైన రాష్ట్ర సమస్యలపైన లోతైన అవగాహన ఉన్న వ్యక్తి ఈయనే. 2024 ఎన్నికలకు ముందే ఏపీకి షిఫ్ట్ అయిన జీవీఎల్ నరసింహారావు కొంతకాలం పాటు వైజాగ్‌కు మాత్రమే పరిమితం అయిపోయారు. ఇప్పుడు మారిన పరిణామాల దృష్ట్యా రాష్ట్ర రాజకీయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించాలని భావిస్తున్నారు. పైపెచ్చు మొదటి నుంచి బిజెపీతోనూ సంఘ్ పరివార్‌తోనూ లోతైన సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తిగా జివిఎల్ బిజెపి కేంద్ర నాయకత్వం దృష్టిలో గుడ్ లుక్స్‌లో ఉన్నారు. బిజెపి రాష్ట్రంలో కష్టకాలంలో ఉన్న సమయంలోనూ నిబద్ధతతో పనిచేసిన వ్యక్తిగా మాధవ్‌కు గుర్తింపు ఉంది. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా ప్రజా సమస్యలపై మాట్లాడిన అనుభవం ఉంది. వివాదరహితుడు కావడంతోపాటు ఉత్తరాంధ్రకు చెందిన నాయకుడిగా ఉన్న పేరు అందరితో కలిసిపోయే మనస్తత్వం మాధవ్‌కు ప్లస్ పాయింట్స్. మంచివాడు సమర్థుడు అనే పేరు ఉన్నా మిగిలిన వారితో పోలిస్తే కేంద్ర నాయకత్వం దగ్గర రాష్ట్ర అధ్యక్షుడు పదవి కోసం ఆ స్థాయిలో లాబీయింగ్ చేయగలడా అనే దానిపై పదవి దక్కుతుందా లేదా అనేది ఆధారపడి ఉంటుంది.ప్రధానంగా ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వ్యక్తులు వీరే. వీళ్ళే కాకుండా క్షత్రియ సామాజిక వర్గం నుంచి విష్ణుకుమార్ రాజు లాంటివాళ్ళు లైన్‌లోనే ఉన్నా ఇప్పటికే ఆ సామాజిక వర్గానికి కేంద్రమంత్రి పదవి ఇచ్చారు. కాబట్టి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తారా లేదా అనేది డౌటే. ఏదైనప్పటికీ గతంలో ఎన్నడూ లేనంతగా ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి కోసం తీవ్రమైన పోటీ అయితే నెలకొని ఉంది. పైన చెప్పిన పేర్లలో ఒకరిని కేంద్ర అధినాయకత్వం గుర్తిస్తుందా లేక మరొక అనూహ్యమైన పేరును తెరపైకి తెస్తుందా అనేది చూడాలి.

# ఏప్రిల్ 28న విశాఖ మేయర్ ఎన్నిక

విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అధికారం కోల్పోయిన తర్వాత పలువురు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు వైసీపీని వీడుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లోకి జంప్ అవుతూ ఉండటంతో ఇప్పటికే పలు కార్పొరేషన్లను, మున్సిపాలిటీలను వైసీపీ కోల్పోయింది. తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో వైసీపీకి షాక్ తగిలింది.

సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీ వైసీపీ చేజారింది. కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నిసాపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో కదిరి మున్సిపాలిటీని కూడా వైసీపీ కోల్పోయింది. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి 25మంది కౌన్సిలర్లు హాజరు కాగా.. ఛైర్ పర్సన్‌తో పాటు వైసీపీ 11మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కోరం ఉండటం... హాజరైన మొత్తం 25మంది అవిశ్వాసానికి మద్దతివ్వడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కదిరి మున్సిపల్ ఆఫీసు వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.మరోవైపు కదిరి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం నెగ్గటంతో టీడీపీ శ్రేణులు టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. ప్రజాస్వామ్యయుతంగానే అవిశ్వాసం జరిగిందన్నారు. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ నజీమున్నిసా అవినీతికి పాల్పడ్డారని.. కదిరిలో అభివృద్ధి లేదని ఆరోపించారు. అందుకే వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారన్న కందికుంట వెంకటప్రసాద్.. కదిరి అభివృద్ధి కోసమే అవిశ్వాసం పెట్టినట్లు తెలిపారు. త్వరలో అందరికీ ఆమోదకరంగా ఉండేలా మున్సిపల్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటామని వెల్లడించారు.మరోవైపు విశాఖపట్నం మేయర్ పీఠం వైసీపీ చేజారిన సంగతి తెలిసిందే. విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం ఇటీవల నెగ్గింది. దీంతో హరి వెంకట కుమారిని మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని అందులో పేర్కొంది. విశాఖ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి 2/3 వంతు సభ్యులు అనుకూలంగా ఓటు వేయటంతో తీర్మానం నెగ్గింది. 110 మంది సభ్యుల్లో 74 మంది తీర్మానానికి మద్దతుగా ఓటేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గగా.. విశాఖ మేయర్ పదవి నుంచి హరి వెంకట కుమారిని తొలగిస్తూ ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోవైపు విశాఖ మేయర్ పదవికి ఏప్రిల్ 28న ఎన్నిక నిర్వహించనున్నారు.

# అలా అయితే ఎలా..తమ్ముళ్ల ఆవేదన

విజయవాడ, ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పార్టీ నేతలతో పాటు క్యాడర్ కూడా ఒకింత అసహనంతో ఉన్నారు. కూటమి ద్వారా అధికారంలోకి వచ్చినప్పటికీ రాజ్యసభ స్థానాల విషయంలో తలవొగ్గి ఉండటం ఎందుకన్న ప్రశ్న తలెత్తుతుంది. రాజ్యసభకు టీడీపీలో తక్కువ స్థానాలు ఉన్నప్పటికీ ఖాళీ అయ్యే ప్రతి స్థానం కమలం ఖాతాలో పడిపోతే ఇక మనకు వచ్చేది ఎప్పుడంటూ నేతలు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ క్యాడర్ ఇదే రకమైన ప్రశ్నలు వేస్తున్నారు. గత ఎన్నికల్లో కూటమి ఏర్పాటయినందున అనేక మంది తమ స్థానాలను త్యాగం చేశారు. అదేసమయంలో చాలా మంది సీనియర్లను పోటీకి దూరంగా పెట్టారు. అయితే వారి సేవలను వినియోగించుకుంటామని చెప్పడంతో ఎక్కువ మంది రాజ్యసభ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. టీడీపీలో చాలా మంది సీనియర్ నేతలు గత ఎన్నికల్లో టిక్కెట్లు దక్కకపోయినా కూటమి విజయం కోసం పనిచేశారు. తమకు సుదీర్ఘకాలంగా ఉన్న పరిచయాలను కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ప్రయత్నించారు. అంతే కాదు.. నియోజకవర్గంలో తమ పట్టు కోల్పోతామని తెలిసినా పార్టీ కోసం వారు కష్టపడి పనిచేశారు. అనేక మంది కొత్త వారికి, యువకులకు అవకాశం ఇవ్వడంతో సీనియర్ నేతలకు టిక్కెట్లు దొరక్కుండా పోయాయి. అయినా అసంతృప్తి లోపల ఉన్నా ఎక్కడా బయటపడకుండా క్యాడర్ కు సర్దిచెప్పి ఎన్నికల్లో విజయం కోసం పాటుపడ్డారు. టీడీపీ అధికారంలోకి వస్తే తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని వారు నమ్మకం పెట్టుకున్నారు. అందుకే గత ఎన్నికల్లో కష్టపడి పనిచేశారు. గతంలో వైసీపీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసినా అందులో రెండింటిలో మాత్రమే టీడీపీ నిలబెట్టింది. రెండింటిలోనూ ఒకటి రాజీనామా చేసి వచ్చిన బీద రవిచంద్ర యాదవ్ కు తిరిగి పదవి ఇచ్చింది. అలాగే మరో రాజ్యసభ పదవి యువకుడైన సానా సతీష్ కు ఇచ్చారు. దీంతో నాడు కూడా సీనియర్ నేతలు పెట్టుకున్న ఆశలు అడియాసలు అయ్యాయి. పార్టీ అధికారంలో లేనప్పుడు తాము కష్టించి పనిచేసినా తమ కష్టాన్ని పార్టీ నాయకత్వం గుర్తించలేదన్న అసహనం కొందరు వ్యక్తంచేశారు. పెద్దల సభలో పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన సమయంలో ఇలా ఒత్తిడులకు తలొగ్గి బీజేపీకి అన్నిస్థానాలను కట్టబెట్టడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. కేవలం అమరావతి, పోలవరం నిర్మాణం కోసం పదవులను పణంగా పెట్టడం ఎంత వరకూ సబబని కొందరు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. బీజేపీకి ఏపీలో ఉన్న బలం తక్కువేనని తెలిసినా అది అడిగిన వెంటనే ఒప్పుకుని సొంత పార్టీ నేతలను రాజకీయంగా దూరం పెట్టేందుకు పార్టీ అగ్రనాయకత్వం చేస్తున్న పనిని పలువురు తప్పుపడుతున్నారు. ఏపీనుంచి కాకుండా తమిళనాడుకు చెందినవారికి రాజ్యసభ పదవి ఇస్తే ఏ రకమైన సంకేతాలు వెళతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మన అవసరం వాళ్లకు ఉందని, దానిని ఆలోచించి పదవుల విషయంలో త్యాగరాజులు కావద్దన్నసూచనలు వెలువడుతున్నాయి.

## భారీగా తగ్గిన ఉల్లిపాయల ధరలు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24,** రాష్ట్రంలోని మధ్య తరగతి ప్రజలకు శుభవార్త. ప్రతిఒక్కరి ఇంట్లో నిత్యావసరాల వస్తువుల జాబితాలో ఉల్లిపాయలు కూడా ఉంటాయి. అయితే, ఇటీవల కాలంలో ఉల్లిపాయ ధరలు భారీగా పెరిగాయి. గత నెలలో హోల్ సేల్ మార్కెట్లో కిలో ఉల్లిగడ్డలు రూ. 40 నుంచి రూ.50 వరకు విక్రయాలు చేశారు. దీంతో పేద వర్గాల ప్రజలు తమ వంటల్లో ఉల్లిపాయను దూరం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ప్రస్తుతం ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి.కొత్త పంట మార్కెట్ కు వస్తుండటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ధరలు సగానికి తగ్గిపోయాయి. ప్రస్తుతం కిలో ఉల్లిగడ్డ ధర రూ. 15 నుంచి రూ.20 వరకు విక్రయాలు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ లోని మెయిన్ హోల్ సేల్ మార్కెట్లు అయిన ఉస్మాన్ గంజ్, మలక్ పేట, సికింద్రాబాద్ మోండా, బోయిన్ పల్లితోపాటు పలు రైతు బజార్లకు పెద్దెత్తున ఉల్లి వస్తుంది. దీంతో ధరలు పడిపోతున్నాయి.మహారాష్ట్ర, కర్నూల్ నుంచి ఉల్లి ఎక్కువగా దిగుమతి అవుతుంది. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా పరిధిలోని తాండూరు, మెదక్ జిల్లాలోని నారాయణఖేడ్, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్, అలంపూర్, నల్గొండ తదితర ప్రాంతాల్లో 40వేల ఎకరాల్లో ఉల్లి సాగవుతుంది. ప్రతీయేటా ఏప్రిల్, మే నెలల్లో పంట చేతికి వస్తుంది. దీంతో మార్కెట్లకు ఉల్లిగడ్డలు భారీగా వస్తున్నాయి. హైదరాబాద్ సిటీలోని మార్కెట్లకు రోజుకు 15వేల నుంచి 18వేల క్వింటాళ్లు ఉల్లిగడ్డలు వస్తున్నాయి. మరోవైపు ఉల్లిపై 20శాతం ఎక్స్ పోర్ట్ ట్యాక్స్ ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని కారణంగానూ ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి.

# నాటకాల రాయుడికి చెక్...

శ్రీకాకుళం, ఏప్రిల్ 24, వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను ఆ పార్టీ నాయకత్వం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ నాయకత్వం దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు రావడంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అర్థమవుతుంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు దువ్వాడపై వరసగా ఫిర్యాదులు రావడంతోనే శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటనలో తెలిపింది. అయితే ఇది ఒక నాటకంగా ప్రత్యర్థి పార్టీలు చెబుతున్నాయి. ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా ఎమ్మెల్సీ పదవి నుంచి కూడా దువ్వాడను తప్పిస్తేనే జనం నమ్ముతారంటున్నారు.. గతంలోనూ ఎమ్మెల్సీ అనంతబాబు విషయంలోనూ ఇదే జరిగిందన్న విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య ఘటనలో నాడు అనంతబాబు జైలుకు వెళ్లారు. నిందితుడిగా చేర్చిన పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దళిత వ్యక్తిని చంపడమే కాకుండా తన కారులోనే పార్శిల్ చేసి ఇంటికి తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన వైనం అప్పట్లోనే సంచలనం కలిగించింది. అయితే అనంతబాబుపై పార్టీ పరంగా చర్యలు తీసుకున్న వైసీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీ పదవి నుంచి మాత్రం వేటు వేయలేకపోయింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆ పనిచేయకపోవడంతో ఆ ఘటన పార్టీ ఓటమికి ఒక కారణంగా మారిందనే చెప్పాలి.ఇక దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం కొత్తగా జరగట్లేదు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న తంతు ఇది. దాదాపు ఏడాది కాలం నుంచి ఈ డ్రామా నడుస్తుంది.దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు ఆయన ఇంటివద్ద ఆందోళనకు దిగారు. .దువ్వాడ శ్రీనివాస్ తో వాణి వివాహమయింది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే గత కొంత కాలం నుంచి ఇద్దరూ విడిపోయి ఉంటున్నారు. దువ్వాడ శ్రీనివాస్ గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అంతకు ముందు శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేశారు. ఓటమి పాలు కావడంతో ఆయనకు వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. తర్వాత 2024 ఎన్నికల్లో టెక్కలి సీటును కూడా దువ్వాడ శ్రీనివాస్ కే జగన్ కేటాయించారు. దీంతో పాటు మాధురి అనే మహిళతో బయట చక్కర్లు కొడుతున్నారు. అయినా సరే ఇప్పటి వరకూ పార్టీ చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దువ్వాడ శ్రీనివాస్ ఫ్యామిలీలో రచ్చ మొదలయింది. ఇది టెక్కలిలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రచ్చ అయింది. పార్టీకి కూడా తలనొప్పిగా మారింది. ఒక ఎమ్మెల్సీగా ఉండి భార్యకు విడాకులు ఇవ్వకుండా దువ్వాడ శ్రీనివాస్ మరో మహిళతో సహజీవనం చేస్తున్నారని ఆయన భార్య వాణి ఆరోపిస్తున్నారు. ఆమె ట్రాప్ లో పడి తమను పూర్తిగా వదిలేశారంటున్నారు. గత కొంతకాలంగా దువ్వాడ శ్రీనివాస్, మాధురి కలసి టూర్లు చేస్తున్నారు. అయినా పార్టీ పట్టించుకోలేదు. తిరుమలలోనూ ఫొటో షూట్ వివాదంగా మారింది. అయినా చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు తాజాగా ఆయనపై సస్పెన్షన్ వేట వేయడం డ్రామాగానే చూడాల్సివస్తుందని, పార్టీకి ఉత్తరాంధ్రలో జరుగుతున్న డ్యామేజీని కాపాడుకోవడానికే ఇప్పుడు సస్పెన్షన్ వేటు వేశారంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అందులో నిజం కూడా ఉంది కదా?

# ఏపీలో మండుతున్న సూరీడు

కర్నూలు, ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఈ సీజన్‌లో ఎన్నడూ లేని స్థాయిలో నంద్యాల జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికమని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.వైఎస్సార్ జిల్లాలో 28, నంద్యాల 22, ప్రకాశం జిల్లాలో 17, పల్నాడు 14, కర్నూలు జిల్లాలోని పదిచోట్ల 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని 30 మండలాల్లో తీవ్రవడగాలులు, 29 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండటం, ఎండవేడిమి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ సూచించారు.ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు పైగా నమోదవుతున్న నేపథ్యంలో వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు. రోజువారీ పనుల కోసం బయట తిరిగే వారు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాలుల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిమ్మరసం, పండ్లరసాలు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలని చెప్తున్నారు. వేసవి సీజన్‌లో దొరికే పుచ్చకాయ, కర్బూజా వంటి పండ్లతో పాటుగా కీరదోస, బత్తాయి, ద్రాక్ష, పైనాపిల్ ఎక్కువగా తీసుకోవాలని చెప్తున్నారు. వీటిలో నీటిశాతం అధికంగా ఉంటుందని.. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడతాయని వివరిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదని.. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి ధరించాలని సూచిస్తున్నారు.

వడదెబ్బ ఎవరికి తగులుతుందంటే..

ఎండాకాలంలో వడదెబ్బ ఫలానా వయసు వారికే తగులుతుందని చెప్పడానికి వీలులేదు.ఎవరికైనా తగలవచ్చు. అయితే శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణులతో పాటుగా వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. సెలవుల సీజన్ కావటంతో శుభకార్యాలు, విహార యాత్రలకు ఎక్కువగా వెళుతుంటారని, ఈ సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తేలికపాటి ఆహారాన్ని తీసుకోవాలని.. వేపుళ్లు, జంక్‌ఫుడ్, మద్యం, మాంసాహారం తక్కువగా తీసుకుంటే మంచిదంటున్నారు. తీవ్రమైన తలనొప్పి, వికారం, వాంతులు, రక్తపోటులో తగ్గుదల వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

## ఒంగోలులో బైక్ ట్రాక్టర్

ఒంగోలు, ఏప్రిల్ 24,మనిషి తలుచుకుంటే సాధ్యం కానిది ఏది లేదంటారు. మానవ మెదడే అతి పెద్ద అద్భుతం.. మరి దానికి కాస్త పదును పెడితే.. అది సృష్టించే విజయాలు ఎన్నో. చరిత్ర సృష్టించాలంటే.. పెద్ద పెద్ద కాలేజీల్లో.. గొప్ప గొప్ప చదువులు చదవాల్సిన అవసరం లేదు. కాస్త బుర్రకు పదును పెడితే.. ఎన్నో అద్భుతాలు చేయవచ్చు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే బైక్ మెకానిక్ కూడా ఇలానే ఆలోచించి.. అద్భుతం చేశాడు. చిన్న ఆలోచనతో లక్షల రూపాయల ఖర్చు చేయాల్సిన అవసరాన్ని అధిగమించాడు. ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ఎడ్లు కచ్చితంగా ఉండాల్సిందే. ఇప్పుడైతే ట్రాక్టర్ తప్పనిసరి అయ్యింది. మరి చిన్న, సన్నకారు రైతులు లక్షల రూపాయలు ఖర్చు చేసి ట్రాక్టర్ కొనాలంటే కష్టం. ఆ సమస్యను సదరు రైతు మెకానిక్ పరిష్కరించాడు.ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం, ఎడ్లూరిపాడుకు చెందిన హజ్రత్ వలి అనే బైక్ మెకానిక్ కాస్త వినూత్నంగా ఆలోచించి.. ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్‌గా పనిచేసేలా మార్చి.. రైతులకు మేలు చేశాడు. వలి కనిపెట్టిన ఈ పరికరం ద్వారా.. రైతులు వ్యవసాయ పనులు చక్కబెట్టుకోవచ్చు. దీని తయారికి గాను వలికి అవసరమైన మొత్తం కేవలం 20 వేల రూపాయలు మాత్రమే.బైక్‌ను ట్రాక్టర్‌గా మార్చాలని భావించిన వలి.. ముందుగా తన ద్విచక్ర వాహనం టైర్లను తొలగించి.. వాటి స్థానంలో బురదలో దిగబడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా తయారుచేసిన బలమైన బటన్ చక్రాలను అమర్చాడు. దాని సామర్థ్యానికి అనుగుణంగా నాగలి, స్ప్రేయర్, విత్తనాలు వేసే పరికరంతో పాటుగా ట్రాలీని కూడా ఏర్పాటు చేశాడు. తమ అవసరానికి తగ్గట్టు రైతులు ఈ పరికరాలను సులభంగా అమర్చుకునేలా లాకింగ్ సిస్టమ్‌ని కూడా అభివృద్ధి చేశాడు.. దీని కోసం రూ. 20,000 ఖర్చు చేశానని వలి చెప్పుకొచ్చాడు. ఎవరైనా పాత బైక్ తీసుకువస్తే, వారి అవసరాలకు అనుగుణంగా మార్పులు చేస్తానని చెబుతున్నాడు వలి. సాధారణ బైక్ మెకానిక్ సాధించిన ఈ విజయం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తుంది. రైతులకు ఎంతో మేలు చేశావని ప్రతి ఒక్కరు అతడిని ప్రశంసిస్తున్నారు.

## వైసీపికి కొత్త వ్యూహకర్త.. రుషిరాజ్ సింగ్

విజయవాడ, ఏప్రిల్ 24, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టి పెట్టారు. పార్టీ ఓటమిపాలై ఏడాది కావస్తున్న తరుణంలో పార్టీ ప్రక్షాళనకు దిగారు. ముందుగా పార్టీలో సమూల మార్పులు తీసుకురావాలని భావించారు. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారు. గత ఎన్నికల్లో అంతులేని ధీమాతో బరిలో దిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీ ప్రజలు చావు దెబ్బ కొట్టారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. వై నాట్ 175 అన్న నినాదంతో బరిలోకి దిగిన ఆ పార్టీకి ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురయింది. అయితే ఇప్పుడిప్పుడే తప్పిదాలను గమనించిన జగన్మోహన్ రెడ్డి దిద్దుబాటు చర్యలకు దిగుతున్నారు. పోయిన చోట వెతుక్కునే పనిలో పడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా 30 మంది సీనియర్ నేతలతో కూడిన పొలిటికల్ అడ్వైజరీ కమిటీనిప్రకటించారు. సభ్యత్వ నమోదు చేపట్టనున్నారు. ఇంకోవైపు కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించే ఆలోచన చేస్తున్నారు. కార్యకర్తల పేరుతో సొంత నిధులతో ఈ బీమా సౌకర్యం కల్పించే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో దీనిపైనే ప్రధానంగా చర్చ నడిచింది. వీలైనంతవరకు నియోజకవర్గ ఇన్చార్జిలను మార్చుతూ జిల్లాల పర్యటనకు దిగాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అయితే గత ఐదేళ్లలో వైఫల్యాలను గుర్తుచేసుకొని మరి ప్రజల్లోకి వెళ్లాలని ఒక అంచనాకు వచ్చారు.అయితే 2024 ఎన్నికల్లో సోషల్ ఇంజనీరింగ్ కు నమ్ముకున్న జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఐపాక్ టీం ఇచ్చిన నివేదికలను ఆధారంగా చేసుకుని పార్టీలో చేర్పులు మార్పులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 80 నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చి చేతులు కాల్చుకున్నారు. అందుకే వారిని తిరిగి యధా స్థానాల్లో నియమించాలని చూస్తున్నారు. ఇప్పటికే చాలామందిని మార్చారు కూడా. అయితే ఉమ్మడి 13 జిల్లాల్లో.. ఎక్కడెక్కడ మార్పులు చేయాలి? ఎవరిని నియమించాలి? ఏ సామాజిక వర్గాన్ని పరిగణలోకి తీసుకోవాలి అన్నదానిపై వ్యూహకర్తలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.2019 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రశాంత్ కిషోర్ వ్యూహకర్తగా సేవలు అందించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా పనిచేశారు. సలహాలతో పాటు సూచనలు అందించారు. అయితే ప్రశాంత్ కిషోర్ మరోసారి జగన్మోహన్ రెడ్డికి పనిచేసే పరిస్థితి లేదు. అలాగని జగన్మోహన్ రెడ్డి సైతం ప్రశాంత్ కిషోర్ ను పిలిచే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఈ తరుణంలో రుషిరాజ్ సింగ్ మరోసారి జగన్మోహన్ రెడ్డి కోసం రంగంలోకి దిగారు. గత కొద్ది రోజులుగా బెంగళూరులోని యలహంక ప్యాలెస్ లో రుషిరాజ్ సింగ్ తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న చాలామంది వ్యూహకర్తలతో జగన్మోహన్ రెడ్డి సమావేశం అయ్యారని.. వారి సలహాలు సైతం తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. త్వరలో జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనకు వెళుతున్న తరుణంలో ఈ సమావేశాలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

# భారత్ యాక్షన్ షురూ..

కశ్మీర్ లోని పెహల్ గాంలో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కశ్మీర్ లోని పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఉగ్ర దాడి వెనుక దాయాదీ దేశం పాకిస్తాన్ హస్తం ఉందని నిర్ధారించిన భారత్? పాక్ తో సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన భద్రతపై కేబినెట్ కమిటీ భేటీలో కేంద్రం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఈ నిర్ణయంతో పాక్ తో భారత్ సంబంధాలు పూర్తిగా రద్దు అవుతాయి. పాక్ పౌరులను ఏ రకంగానూ భారత్ లోకి అనుమతించరు. అంతేకాకుండా పాక్ తో దౌత్యపరమైన సంబంధాలు కూడా పూర్తిగా నిలిచిపోనున్నాయి. భద్రతపై కేబినెట్ కమిటీ భేటీ ముగిసిన వెంటనే కేంద్రం తీసుకున్న నిర్ణయాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ప్రస్తుతం భారత్ లో ఉన్న పాక్ పర్యాటకులతో పాటు ఇతరత్రా పనుల నిమిత్తం భారత్ వచ్చిన ఆ దేశ పౌరులు భారత్ ను వీడేందుకు కేవలం 48 గంటల వ్యవధిని ఇస్తున్నట్లు మిస్రీ తేల్చి చెప్పారు. అంటే.. గురు, శుక్రవారా ల్లోగా పాక్ పౌరులు భారత్ ను వీడాల్సి ఉంటుంది. ఇకపై భారత్ లోకి పాక్ పర్యాటకులను గానీ, ఇతరత్రా ఏ కారణాలతో అయినా గానీ ఆ దేశ పౌరులను అనుమతించేది లేదని కూడా తేల్చి చెప్పారు. అంతేకాకుండా భారత్ లోని పాక్ హై కమిషనర్ ను దేశం వదిలి వెళ్లిపోవాల్సింది ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. పాక్ ఇప్పటిదాకా కొనసాగుతున్న భారత సంబంధాలు పూర్తిగా స్తంభించనున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న అటారీ-వాఘా సరిహద్దును తక్షణమే మూసివేస్తున్నట్లుగా మిస్రీ వెల్లడించారు. అంతేకాకుండా ఇరు దేశాల మధ్య అమలు అవుతున్న సింధూ జలాల ఒప్పందాన్ని కూడా తక్షణమే నిలిపివేస్తున్నట్లుగా కూడా కేంద్రం నిర్ణయం తీసుకుందని ఆయన ప్రకటించారు. జమ్మూకశ్మీర్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ ఉందని భారత్ నిర్ధారణకు వచ్చింది. ఆదేశంపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందన్న దానికి తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని కేంద్రం ప్రకటించింది. 1960లో ఒప్పందం చేసుకున్న సింధు నదీ జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇస్లామాబాద్‌లోని భారతీయ హైకమిషన్‌ను మూసివేయాలని నిర్ణయించారు, అలాగే పాకిస్తాన్ నుంచి భారత దౌత్యవేత్తలను వెనక్కి రప్పించాలని నిర్ణయించారు. భారత్‌లో ఉన్న పాకిస్తాన్ సైనిక సలహాదారులను "పర్సోనా నాన్ గ్రాటా" గా ప్రకటించారు, వారిని దేశం విడిచి వెళ్లమని ఆదేశించారు.పాకిస్తాన్‌తో అన్ని నయతంత్ర సంబంధాలను తెంచుకునే దిశగా పరిశీలన చేస్తున్నారు. పాక్ హైకమిషనర్‌ను ఇండియా నుంచి పంపించేయాలని నిర్ణయించారు. పెహల్ గాం ఉగ్ర దాడి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల మార్గదర్శకత్వంలోనే జరిగిందని, దాడికి పాకిస్తాన్ సైన్యాధిపతి నుంచి కూడా పూర్తిగా సహకారం అందిందన్న ఆధారాలు కూడా లభ్యమయ్యాయి. దీంతోనే ఈ దాడిని ఈజీగా తీసుకోరాదన్న నేపథ్యంలో కేంద్రం కఠిన నిర్ణయాన్ని తీసుకుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.పహల్గామ్‌లో జరిగిన దారుణ ఉగ్రదాడి వెనుక ఉన్నది తామేనంటూ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించుకోవడంతో, ఈ సంస్థ మళ్లీ వార్తల్లోకి వచ్చింది. ఈ దాడిలో 25 మందికి పైగా పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనతో 'టీఆర్ఎఫ్' గురించి మరోసారి చర్చ మొదలైంది. అసలు ఈ టీఆర్ఎఫ్ ఎవరు? దీని వెనుక ఎలాంటి శక్తులు పనిచేస్తున్నాయి? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.2019 ఆగస్టులో కేంద్రం ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత పాక్ ప్రోత్సహంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ, పాకిస్థాన్ ఉగ్రసంస్థ లష్కరే తోయిబాకు అనుబంధంగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఏర్పడిన తక్కువ సమయంలోనే ఈ సంస్థ కశ్మీర్ లో తన ఉనికిని చాటుకుంది. హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహ్మద్ లాంటి ఉగ్ర సంస్థల సభ్యులను టీఆర్ఎఫ్‌లో చేర్చుకుని, దాడులకు సరికొత్త వ్యూహాలను రచించింది. భారత హోంమంత్రిత్వ శాఖ 2023 జనవరిలో ఈ సంస్థను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం నిషేధించిందిఈ సంస్థకు షేక్ సజ్జాద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, బాసిత్ అహ్మద్ దార్ ఆపరేషనల్ చీఫ్‌గా వ్యవహరించారు. ట్రెండింగ్ సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని, ఈ సంస్థ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రమైన హింసను రెచ్చగొడుతోంది. కాశ్మీరీ పండిట్లు, స్థానిక పోలీసులు, కార్మికులు, పర్యాటకులు, వ్యాపారస్తులు వంటి సాఫ్ట్ టార్గెట్లను ఎంచుకుని హింసకు పాల్పడుతోంది. తాజాగా పహల్గామ్‌లో జరిగిన దాడి ఈ వ్యూహానికే ఉదాహరణగా చెబుతున్నారు.2018లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో పెట్టడంతో, లష్కరే తోయిబా తరఫున పాక్ గూఢచార సంస్థ (ఐఎస్ఐ) ఈ టీఆర్ఎఫ్‌ను సృష్టించిందని విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా దృష్టి మరల్చేందుకే కొత్త పేరుతో పాత ఉగ్ర సంస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి పాక్ ఈ వ్యూహానికి తెరతీసింది. ఈ సంస్థ గతంలో గందర్‌బల్‌లో ఓ వైద్యుడితో పాటు కార్మికులు సహా ఏడుగురిని పొట్టనబెట్టుకుంది. అంతేకాకుండా 2020లో కుప్వారా సెక్టార్‌లో జరిగిన పోరులో ఐదుగురు భారత జవాన్లు వీరమరణం పొందడం కూడా ఇదే సంస్థ పనే.ప్రస్తుతం అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో ఈ సంస్థ కార్యకలాపాలపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. పహల్గామ్ ఘటన తర్వాత ఈ సంస్థపై మరింత నిఘా పెంచారు. మొత్తం మీద టీఆర్ఎఫ్ సంస్థ కశ్మీర్ లో మరోసారి నెత్తుటి మరకలు చల్లేందుకు సిద్ధపడుతోందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో టీఆర్ఎఫ్‌పై భద్రతా దళాల పోరాటం మరింత తీవ్రతరం కానుంది.

## హైబ్రిడ్ టెర్రరిస్టులతో.. పాకిస్తాన్ ఘాతుకం

### డిజిటల్ ఎవిడెన్స్ సేకరించిన ఎన్ ఐఏ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25, (న్యూస్ పల్స్) పహల్గామ్‌లో పర్యాటకుల ఊచకోత వెనుక హైబ్రిడ్ టెర్రర్ హస్తం బయటపడింది. పాక్‌లో నక్కిన టెర్రరిస్టు గురువుల ఆదేశాలతో ఈ దాడికి పాల్పడినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ మధ్యే పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ నుంచి ముష్కరమూకకు ఎప్పటికప్పుడు ఆదేశాలు అందుతున్నట్టు పహల్గామ్ దాడి జరిగిన ప్రదేశం నుంచి ఔఎం డిజిటెల్ ఎవిడెన్స్‌ను సంపాదించింది. కశ్మీర్ పండిట్ల ఊచకోత వెనుక కూడా హైబ్రిడ్ టెర్రరిస్టుల హస్తమే బయటపడింది. అందుకే దాడికి పాల్పడ్డ వాళ్లతో పాటు స్కెచ్ గీసిన వాళ్లను కూడా కఠినంగా శిక్షించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదన్నారు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్. హైబ్రిడ్ టెర్రరిజాన్ని కూడా ఉక్కుపాదంతో అణచివేయాలని కేంద్రం నిర్ణయించింది.కశ్మీర్ పాక్‌కి జీవనాడి అంటూనే.. 13లక్షల సైన్యం ఉన్న భారత్ తమనేం చేయలేదన్నారు. ఎన్నో త్యాగాల తర్వాత పాకిస్తాన్ ఏర్పడిందని.. దాన్ని ఎలా కాపాడుకోవాలో తమకు తెలుసన్నారు.ఉగ్ర దాడి వెనుక కీలక సూత్రధారి లష్కరే తోయిబా టాప్ కమాండర్ సైపుల్లా కసూరి అలియాస్ ఖలీద్ ఉన్నాడని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ముసాతో పాటు రావల్‌కోటకు చెందిన మరో లష్కరే ఉగ్రవాది కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి. ఐదు రోజుల క్రితం ఓ సమావేశంలో.. జిహాద్ కొనసాగుతుంది.. తుపాకులు ఎక్కుపెట్టి ఉన్నాయని ప్రకటించాడు ముసా. అటు పాక్ ఆర్మీ చీఫ్.. ఇటు మునీర్ ప్రకటన చేసిన రోజుల వ్యవధిలోనే.. బైసరన్‌లో నరమేధం సృష్టించారు ఉగ్రవాదులు.పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ ప్రమేయం స్పష్టంగా బయటపడింది. అమాయక పౌరులను కాల్చి చంపింది పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులే.. అంతేకాదు వాళ్లకు ఆదేశాలు కూడా పాకిస్తాన్ నుంచే వచ్చాయి.. హైబ్రిడ్ టెర్రరిస్టులతో పాకిస్తాన్ ఈ ఘాతుకానికి పాల్పడింది. లష్కర్ స్లీపర్‌సెల్ పహల్గామ్‌లో నరమేధం సృష్టించింది. 2024లో ఆర్మీ క్యాంప్‌పై దాడి చేసిన ఉగ్రవాదుల బ్యాచే పహల్గామ్‌లో టూరిస్టులను ఊచకోత కోసింది. ఆ దాడి తరువాత సైలెంట్ గా ఉన్న ముష్కర మూక పహల్గామ్‌లో పంజా విసిరింది.వాళ్లకు టెర్రరిజం వృత్తి.. కానీ ముసుగులో మరో ఉద్యోగాలు చేస్తుంటారు. ఒకసారి అటాక్‌లో పాల్గొంటే మళ్లీ ఎప్పటికో దాడుల్లో పాల్గొంటారు. ఈ గ్యాప్‌లో సామాన్యుల్లా అమాయకుల్లా, రోజువారీ జీతగాళ్లలా బిల్డప్‌లు ఇస్తుంటారు. పహల్గావ్ ఉగ్రదాడి నిందితులు కూడా 2018లో పూంచ్ ఎటాక్ తర్వాత సైలెన్స్ అయ్యారు. -రెగ్యులర్ యాక్టివిటీస్ లేకపోవడంతో ట్రేసింగ్ కూడా సవాలే అని చెప్పుకోవాలి. ముసుగేసిన లష్కర్ ఇ తోయిబానే..టీఆర్ ఎఫ్ గా మారింది. విరుగుడుగా బలగాల ద్విముఖ వ్యూహంతో ముందుకెళ్తున్నాయి. ఇక కశ్మీర్ లోపలంతా ఏరివేత.. బోర్డర్‌లో ఉగ్రవేట కొనసాగుతోంది.హైబ్రిడ్ టెర్రర్ బ్యాచ్‌లో సభ్యులపై నిఘా వర్గాల దగ్గర కచ్చితమైన సమాచారం లేదు. టార్గెట్‌ను ఫినిష్ చేసిన తరువాత ఈ బ్యాచ్ చాలా కాలం సైలెంట్‌గా ఉంటుంది. టీమ్ సభ్యులు విడిపోయి మళ్లీ కలుస్తారు.. ఉగ్రవాద కార్యకలాపాలకు దూరంగా ఉంటారు.. తరువాత పాకిస్తాన్ నుంచి ఆదేశాలు రాగానే మళ్లీ దాడులు మొదలుపెడుతారు.పహల్గామ్‌లో ఇదే జరిగింది. పూంచ్‌లో దాడికి పాల్పడ్డ గ్రూపుకు పాక్ ఆర్మీ రిటైర్డ్ జవాన్ ఆసిఫ్ లీడ్ చేశాడు. ఈ గ్యాంగ్‌కు పాకిస్తాన్‌లో ఉన్న లష్కరే డిప్యూటీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న సైఫుల్లా నుంచి ఎప్పటికప్పుడు ఆదేశాలు వస్తున్నాయి. పహల్గామ్ దాడి కోసం కరాచీ, ముజఫరాబాద్‌లో వార్ రూమ్‌ను ఏర్పాటు చేశాడు సైఫుల్లా..పాకిస్తాన్ నుంచి ముష్కరమూకకు ఎప్పటికప్పుడు ఆదేశాలు అందుతున్నట్టు పహల్గామ్ దాడి జరిగిన ప్రదేశం నుంచి ఔఎం డిజిటెల్ ఎవిడెన్స్‌ను సంపాదించింది. కశ్మీర్ పండిట్ల ఊచకోత వెనుక కూడా హైబ్రిడ్ టెర్రరిస్టుల హస్తమే బయటపడింది. అందుకే దాడికి పాల్పడ్డ వాళ్లతో పాటు స్కెచ్ గీసిన వాళ్లను కూడా కఠినంగా శిక్షించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదన్నారు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్. హైబ్రిడ్ టెర్రరిజాన్ని కూడా ఉక్కుపాదంతో అణచివేయాలని కేంద్రం నిర్ణయించింది.

## ఇంక పాకిస్తాన్ కు నీటి కష్టాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24, (న్యూస్ పల్స్) పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో మరోసారి పాకిస్థాన్ కుట్ర బయటపడుతోంది. రహస్య సమాచార వర్గాల ప్రకారం, ఉగ్రవాద దాడి పాకిస్థాన్‌లోనే స్కెచ్ వేశారని తెలుస్తోంది. దాడి వెనుక హఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడైన సైఫుల్లా కసూరి చేయి ఉందని చెబుతున్నారు. అందుకే పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడానికి భారతదేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో అత్యంత ముఖ్యమైన నిర్ణయం సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయడం. భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయంతో పాకిస్థాన్ నీటి కోసం దిక్కుతోచని స్థితిలో పడే ప్రమాదం ఉంది. పహల్గాం ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలను బలిగొన్నారు. అప్పటి నుంచి యావత్ భారతం ఆగ్రహంతో ఊగిపోతోంది. పాకిస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే ఆసక్తితో కేంద్రంవైపు? ప్రజలంతా ఎదురు చూశారు. ప్రధానమంత్రి మోడీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 1960లో జరిగిన సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయాలని నిర్ణయించారు. భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయం ఒక్కసారిగా పాకిస్థాన్ మొత్తం దాహం కేకలతో అల్లాడిపోనుంది. ఇంతకీ సింధు జల ఒప్పందం గురించి పూర్తి వివరాలు ఏంటో చూద్దాం. భారత-పాకిస్థాన్ విభజన తరువాత రెండు దేశాల నీటి అవసరాలను తీర్చడానికి ఈ ఒప్పందం కుదిరింది. 1960 సెప్టెంబర్ 19న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయుబ్ ఖాన్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం, బ్యాస్, రావి, సట్లెజ్, సింధు, చినాబ్, జీలం అనే ఆరు నదుల నీటి వినియోగానికి సంబంధించిన నియమాలు నిర్ణయించారు. ఈ ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు చినాబ్, జీలం, సింధు అనే మూడు పశ్చిమ నదుల నుంచి పూర్తిగా నీరు లభిస్తుంది. అదే సమయంలో భారతదేశానికి సట్లెజ్, బియాస్, రావి నదుల నీరు లభిస్తుంది.స్వాతంత్ర్యం తరువాత పాకిస్థాన్‌తో అనేక యుద్ధాలు చేసిన భారతదేశం ఎప్పుడూ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించలేదు. పాకిస్థాన్‌కు నీటి సమస్య రాకుండా చేసింది. అయితే, దీర్ఘకాలంగా భారతదేశంలో ఈ జల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి. ఇప్పుడు భారతదేశం ఆ నిర్ణయాన్ని తీసుకుంది. ప్రపంచ బ్యాంకు దీర్ఘకాలిక మధ్యవర్తిత్వం తరువాత భారతదేశం, పాకిస్థాన్ మధ్య సింధు జల ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం అమలులోకి రాకముందు 1948 ఏప్రిల్ 1న భారతదేశం నీటిని ఆపివేసింది. దీని వల్ల పాకిస్థాన్ పంజాబ్‌లోని 17 లక్షల ఎకరాల భూమి నీరు లేక బీడుగా మారింది. ఇప్పుడు ఈ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయడం ద్వారా భారతదేశం పాకిస్థాన్‌ను కుంగదీసింది. నిజానికి, పాకిస్థాన్‌లోని పంజాబ్, సింధ్ ప్రాంతాలు వాటి నీటి అవసరాలను తీర్చుకోవడానికి చినాబ్, జీలం, సింధు వంటి నదుల నీటిపై పూర్తిగా ఆధారపడి ఉన్నాయి. కానీ ఇప్పుడు పాకిస్థాన్‌కు ఈ నదుల నీరు లభించదు.

## విడదల రజిని మరిది అరెస్టు

మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజిని మరిది గోపీ అరెస్టు అయ్యారు. హైదరాబాద్లో అతడిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. క్రషర్ యజమానిని బెదిరించారని గోపీపై ఆరోపణలు రావడంతో అరెస్టు చేశారు. ఈ కేసులో అతడు ఏ3గా ఉన్నారు. కాగా.. గోపీని ఏపీ తరలించనున్నట్లు సమాచారం.

## పాకిస్తాన్ లో ట్రైనింగ్...

### టెక్నాలజీకి దూరం...

### ఉగ్రవాదుల ప్లానింగ్

శ్రీనగర్, ఏప్రిల్ 24, మొత్తం ఏడుగురు ఉగ్రవాదులు పహల్గాం దాడికి పాల్పడినట్లు తెలుస్తుంది. దాడి చేసిన వారిలో ఇద్దరు స్థానిక ఉగ్రవాదులు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. విదేశీ ఉగ్రవాదులు మాట్లాడిన ఉర్దూ పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాలకు చెందింది. వారితో ఇద్దరు స్థానిక ఉగ్రవాదులు ఉన్నట్లు అనుమానిస్తున్నట్లు భద్రతా సంస్థకు చెందిన ఓ అధికారి తెలిపారు. అధికారులు బుధవారం ముగ్గురు ఉగ్రవాదుల స్కెచ్‌లను విడుదల చేశారు. వారి గురించిన సమాచారం ఇచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున రివార్డు కూడా ప్రకటించారు. నిందితుల్లో గతేడాది ఎంఈ కాన్వాయ్‌పై జరిగిన దాడిలోనూ ఓ అనుమానితుడి హస్తం ఉన్నట్లు ఉన్నత వర్గాలు భావిస్తున్నాయి. మిగతా ఇద్దరు కుల్గాంలోని బిజ్‌బెహారా, థోకెర్‌పోరాకు చెందినవారని భావిస్తున్నారు.వీరు 2017లో పాకిస్తాన్‌కు వెళ్లి గత ఏడాదే తిరిగి జమ్మూకి వచ్చారు. వారు పాకిస్తాన్‌లో శిక్షణ పొందారని సమాచారం. ఆ ఇద్దరు ఉగ్రసంస్థ జైష్-ఎ-మొహమ్మద్‌తో సంబంధం కలిగి ఉన్నారు. ఈ దాడి అమలు చేయడానికి లష్కరే-ఎ-తోయిబా, జైష్‌తో పొత్తు పెట్టుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు కేంద్ర నిఘా సంస్థ వెల్లడించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా అనేక ఉగ్రవాద దాడుల్లో భాగస్వామిగా ఉన్న లష్కరే అగ్ర కమాండర్ సైఫుల్లా కసూరి అలియాస్ సైఫుల్లా ఖలీద్ ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. అతను 26/11 ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు సన్నిహితుడు. దాడి అనంతరం ఉగ్రవాదులంతా పిర్ పంజాల్ శ్రేణిలోని ఎత్తైన ప్రాంతాలకు పారిపోయారు. సైన్యం, కేంద్ర పారామిలిటరీ దళాలతోపాటు జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు.దాడి చేసిన వారు బాడీ కెమెరాలను చిత్రీకరించి ఉంటారని పోలీసులు తిలిపారు. గత మూడేళ్లలో జమ్మూలో జరిగిన అన్ని దాడుల్లోనూ బాడీ, గన్-మౌంటెడ్ కెమెరాల ద్వారా వీడియోలను చిత్రీకరించారు. ఈ వీడియోలను ప్రచార ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. ఫుటేజీని ఉపయోగించి ఒఖ ప్రచార సామగ్రిని విడుదల చేస్తున్నారు. దాడి చేసిన వ్యక్తులు కాశ్మీర్‌లోకి ఎలా ప్రవేశించారో, వారు ఎంతకాలంగా లోయలో ఉంటున్నారో ఇప్పటికీ తెలియరాలేదు. సరిహద్దుల్లో ఉన్న దుర్భర పరిస్థితులను ఆధారంగా చేసుకుని ముష్కరులు దేశంలోకి ప్రవేశించి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. కానీ ఇందుకు సంబంధించి ఖచ్చిత ఆధారలు లభించలేదు. ఏజెన్సీలు వివరాలను ధృవీకరించేపనిలో పడ్డాయి. బుధవారం ఘటనా స్థలానికి ఔఎం అధికారుల బృందం చేరుకుంది. దర్యాప్తును స్థానిక పోలీసుల నుంచి ఏజెన్సీ స్వీకరించే అవకాశం ఉంది. స్థానిక పోలీసులు సహాయం అందించాలని, సాక్షులందరి వాంగ్మూలాలను పరిశీలించాలని ఓ అధికారి తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దాడి జరిగిన బైసారన్ మైదానాన్ని సందర్శించారు. శ్రీనగర్‌లో పోలీసులు, ఇంటెలిజెన్స్ బ్యూరో, సైన్యంలోని ఉన్నతాధికారులతో భద్రతా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. దాడి బాధితులను కూడా ఆయన కలిశారు. బాధితుల్లో ఎక్కువ మందిని తల, ఛాతీపై కాల్పులు జరిపారు. 12 మంది బాధితుల తలలకు బుల్లెట్ గాయాలున్నాయి. వీటిని 'కోల్డ్ బ్లడెడ్ హత్యలు' అని అంటారని ఓ అధికారి తెలిపారు. అడవి నుంచి వచ్చి.. మారణహోమం ముగిసిన తర్వాత తిరిగి అడవిలోకి వెళ్లారు. దాడి సమీపంలో నంబర్ ప్లేట్ లేని బైక్ కనిపించింది. కానీ ఉగ్రవాదులు పారిపోయే సమయంలో దీనిని ఉపయోగించలేదని దర్యాప్తు అధికారులు తెలిపారు.దాడి జరిగిన ప్రాంతంలో పర్యాటకుల సౌకర్యం కోసం టెంట్లు, ప్లాస్టిక్ కుర్చీలు ఉంటాయి. కొంతమంది స్థానిక విక్రేతలు తిను బండారాలు అమ్ముతుంటారు. ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యంలేనందున పర్యాటకులు కాలనడకన లేదంటే గుర్రంపై పహల్గామ్ మార్కెట్ నుంచి 5-6 కి.మీ దూరం ప్రయాణిస్తుంటారు. ఇక్కడికి నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. ఇది హపట్నార్‌ను మరోవైపు చందన్‌వారీకి అనుసంధానించే దట్టమైన అటవీ ప్రాంతం కూడా. ఈ అడవులనే ఉగ్రవాదులు ఆసరాగా చేసుకుని దాడికి తెగబడ్డారు. ఇలాంటి రద్దీ టూరిస్ట్ ప్లేస్‌లో భద్రతా చర్యలు ఎందుకు చేపట్టలేదనే విమర్శలు వస్తున్నాయి. నిజానికి, ఉగ్రవాదుల కదలికలు పసిగట్టడం అంత తేలికకాదు. ఈ ఉగ్రవాదులు చిన్న చిన్న సమూహాలుగా పనిచేస్తుంటారు. మైనస్ 10 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా అడవుల నుంచి వారు బయటకు రారు. ఎటువంటి గాడ్జెట్‌లను ఉపయోగించరు. అందుకే సాంకేతిక ద్వారా నిఘాను సేకరించే అవకాశం లేదు.అంతేకాకుండా వారు స్థిరంగా ఓ చోట ఉండరు. తమ స్థావరాలను ఎప్పటికప్పుడు మారుస్తూనే ఉంటారు. ఉదాహరణకు.. సోనార్గ్ శిఖరాలపై ఉగ్రవాదుల గుంపు ఉన్నట్లు సమాచారం అందితే అధికారులు స్పందించేలోపు ఉగ్రమూక వేరే ప్రాంతానికి తరలివెళ్లిపోతారు. ఇదంతా చేసేందుకు వారికి అడవులే ఆధారం. దాడి చేసిన వారు ఇటీవలే చొరబడినట్లు కనిపిస్తోందని మరో పోలీసు అధికారి తెలిపారు. బైసారన్ పర్వతాలు, దట్టమైన అడవులు ఉగ్రవాదులకు సహజ ఆశ్రయం కల్పిస్తుందని అన్నారు. అడవుల గుండా కోకర్నాగ్, కిష్త్వార్ వైపు గానీ లేదంటే బాలతాల్, సోనామార్గ్ వైపుగానీ వెళ్లే అవకాశం ఉంది.

ఉగ్రవాద కార్యకలాపాల స్థలాకృతి చూస్తే.. కిష్త్వార్ పర్వతాలు, దట్టమైన అడవుల ద్వారా జమ్మూలోని కథువాకు అనుసంధానించబడిన దోడా వరకు ఉన్నాయి. ఇటీవల కాలంలో కథువా ద్వారా చొరబాట్లు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

## ఒక్కొ మార్కుతో

## లక్షా 85 వేల మంది ఫెయిల్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24,** తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఒక్క మార్కు తేడా అనేకమంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపింది. బోర్డు వర్గాల ప్రకారం, దాదాపు 1.85 లక్షల మంది విద్యార్థులు ఒక్క మార్కు తేడాతో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఇది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆవేదనను కలిగించింది. ఈ ఏడాది మొత్తం ఉత్తీర్ణత శాతం 71.37గా నమోదైంది. ఇందులో బలమైన ప్రదర్శన కనబర్చిన గురుకుల విద్యా సంస్థలు 83.17 శాతం ఉత్తీర్ణతతో ముందున్నాయి. అంతేకాకుండా, కొన్ని కళాశాలల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు మెరిశారు. బైపీసీ స్ట్రీమ్‌లో ఓ విద్యార్థిని 997 మార్కులతో టాప్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఎంపీసీలో నలుగురు విద్యార్థులు 996 మార్కులు సాధించారు. దేవరకొండ గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివిన విద్యార్థిని కూడా బైపీసీలో 996 మార్కులు సాధించడం విశేషం.ఇదిలా ఉంటే..1.85 లక్షల మంది ఫెయిల్ కావడంపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు చెప్పినట్లు, గ్రేస్ మార్కులు, రీ?వెల్యూయేషన్ విధానాలపై స్పష్టత అవసరం. అలాగే, విద్యార్థుల మెరుగైన మానసిక స్థితిని పరిగణలోకి తీసుకుని, మరింత హృదయపూర్వక పరీక్షా విధానం అవసరమని సూచిస్తున్నారు. రీవాల్యువేషన్, రీకౌంటింగ్‌లో ఇందులో చాలా మంది పాస్ అయ్యే అవకాశం ఉంది.ఇక మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ మే మొదటి వారంలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇందులో ఫెయిల్ అయిన విద్యార్థులు ఫాస్ అయ్యే అవకాశం ఉంది.

# బాహుబలి సభకు భారీ ఏర్పాట్లు

**వరంగల్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24,** 25 ఏళ్ల వైభవాన్ని చాటిచెప్పేలా అట్టహాసంగా ఏర్పాట్లు చేస్తోంది గులాబీ పార్టీ. బాహుబలి వేదిక.. ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తు చేసేలా ప్రదర్శనలు.. ఇలా చెప్పుకుంటే పోతే ఎన్ని విశిష్టతలు ఉండబోతున్నాయని భారతీయ రాష్ట్ర సమితి పార్టీ సంకేతాలు ఇస్తోంది. పోరాటాల పురిటిగడ్డ వరంగల్ వేదికగా కనీవినీ ఎరుగని రీతిలో జనసమీకరణ చేసి తమ సత్తా చాటుతామంటోంది కారు పార్టీ. ఇంతకీ ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి.వరంగల్‌ను సెంటిమెంట్‌గా భావిస్తున్న గులాబీ పార్టీ.. మూడు జిల్లాల సరిహద్దు అయిన ఎల్కతుర్తి దగ్గర రజతోత్సవ మహాసభ నిర్వహించేందుకు పార్టీ ప్లాన్ చేసింది. ఏప్రిల్ 27వ తేదీన జరగబోయే ఈ మహాసభకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల సరిహద్దు ప్రాంతం వేదికైంది. తమ సత్తా ఏంటో ఈ సభ ద్వారా చాటుతామంటోంది కారు పార్టీ కేడర్. సభకు సుమారు పది లక్షల మంది కార్యకర్తలు వస్తారని పార్టీ అంచనా వేస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చే జనాలకు ఏ మాత్రం ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్లాన్ ప్రకారం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో పనులు వేగవంతంగా సాగుతున్నాయి.మొత్తం 1213 ఎకరాల్లో బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందులో 159 ఎకరాల్లో సభా ప్రాంగణం. 5 ఎకరాల విస్తీర్ణంలో సభా వేదిక ఉంటుంది. ఐదు వందల మంది కూర్చునేలా బాహుబలి వేదిక నిర్మాణమవుతోంది. సభకు వెనుకాలే 4 ఎకరాలు వీఐపీ పార్కింగ్‌కు కేటాయించారు. ఇక 150 ఎకరాల్లో పబ్లిక్, ఎవిఖ, ప్రెస్ సహా ఉద్యమకారులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన స్థలాన్ని భోజన వసతి, పార్కింగ్ కోసం కేటాయించారు. ఎటువైపు నుంచి వచ్చే వాహనాలు అటువైపే పార్క్ చేసేలా.. ఐదు ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాటు చేస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పది లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు.రాజకీయ పార్టీలు పెట్టే బహిరంగ సభలకు కొంత డబ్బులు ఖర్చు అవ్వడం కామన్ విషయమే. ఇక ఎన్నికల సమయంలో పెట్టే భారీ బహిరంగ సభలకు అయితే కోట్లల్లో ఖర్చు అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో భారీ బహిరంగ సభలకు కేరాఫ్ అడ్రస్ కచ్చితంగా భారత రాష్ట్ర సమితినే. ఉద్యమ కాలం నుంచి అధికారంలో ఉన్న ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చున్న బహిరంగ సభలు నిర్వహించడంలో ఆ పార్టీ ప్రత్యేకత వేరు. మిగతా రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలోనే బహిరంగ సభలో నిర్వహిస్తే బీఆర్ఎస్ మాత్రం కనీసం ఏడాదికి ఒకటి రెండు బహిరంగ సభలో నిర్వహిస్తూ వస్తుంది. అధికారంలో ఉండగా కొంగర కలాన్‌లో ఐదు లక్షల మందితో పెద్ద ఎత్తున సభ నిర్వహించి సక్సెస్ చేసింది. అధికారంలో ఉండగానే రైతు మహాసభ నిర్వహించింది. ఇక వరంగల్లో ఉద్యమ కాలంలో పోరుగర్జన, సింహ గర్జన లాంటి సభలను లక్షలాది మందితో సక్సెస్ చేసుకుంది. కానీ ఇప్పుడు అంతకు మించి అంటూ మరోసారి గులాబీ సత్తా చాటేందుకు ముందుకు వస్తుంది బీఆర్ఎస్.తనకు అచ్చి వచ్చిన వరంగల్‌లోనే మరో అతి భారీ బహిరంగ సభకు తెరలేపింది. ఏప్రిల్ 27వ తేదీన పార్టీ 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా ఈ బాహుబలి బహిరంగ సభ జరగనుంది. ఇందుకోసం 10 లక్షల మందిని సమీకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది గులాబీ పార్టీ. అయితే జన సమీకరణం పక్కన పెడితే ఖర్చు కూడా బాహుబలి స్థాయిలోనే కనిపిస్తుంది. ఇప్పటికే అధికారికంగా ప్రతి నియోజకవర్గానికి 25 లక్షల రూపాయలు పార్టీ తరఫున చెక్కులు విడుదల చేశారు. ఈ అమౌంట్ దాదాపుగా రూ. 30 కోట్లు. దీంతోపాటు 1200 ఎకరాలను రైతుల దగ్గర లీజుకు తీసుకుంది పార్టీ. ఈ 1200 ఎకరాల్లో చదును చేయడం, బారికేడ్లు వేయడం, రోడ్లు వేయడం, స్టేజ్, గెస్ట్ ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఇలా కేవలం సభాస్థల వద్ద మరొక 20 నుంచి 25 కోట్ల రూపాయలు ఖర్చే అవకాశం కనిపిస్తుంది.వీటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ఆర్టిస్టులతో వాల్ రైటింగ్ నిర్వహిస్తుంది పార్టీ. ఏప్రిల్ 20వ తేదీన మొదలుపెట్టి వారం రోజులపాటు అంటే బహిరంగ సభ జరిగే 27 వరకు రాష్ట్రవ్యాప్తంగా గులాబీ జెండాలు ఫ్లెక్సీలు, హోర్డింగులు పెట్టించనుంది. వీటితోపాటు పేపర్లు టీవీల్లో అడ్వర్టైజ్మెంట్ లు కూడా.. వీటి కోసం మరొక 20 ? 25 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇక జన సమీకరణ కోసం ఇప్పటికే ఆర్టీసీకి రూ. 9 కోట్లు చెల్లించింది భారత రాష్ట్ర సమితి. వీటితోపాటు ప్రైవేటు వాహనాలు. మధ్యలో వారికి భోజనాలు, సభా స్థలం వద్ద పది లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల వాటర్ ప్యాకెట్లు, కూలర్లు ఇలా వీటన్నింటికీ మరో పాతి కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇలా గులాబీ బాహుబలి బహిరంగ సభ కోసం దాదాపు రూ. 100 కోట్ల దాకా ఖర్చు పెట్టనుంది పార్టీ. ఈ లెక్కన తెలుగు రాష్ట్రాల్లో జన సమీకరణ పరంగా చూసిన, ఖర్చుపరంగా చూసిన ఇదే భారీ బహిరంగ సభ.ఈ బహుబలి సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలంతా ఏర్పాట్లలో బిజీ బిజీగా ఉన్నారు. సభా ఏర్పాట్ల దగ్గర నుంచి జనసమీకరణ వరకు అనేక కమిటీలు ఏర్పాటు చేసుకుని సమన్వయంతో పనిచేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ నేతలు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# కొండగట్టులో కోతులు

**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24,**జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వాం దేవస్థానానికి ప్రతి రోజూ పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచీ.. ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఇక్కడ కొండపైన కొలువై ఉన్న అంజనేయస్వామి ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ చాలా యేళ్లుగా కోతులు ఉన్నాయి. అయితే.. గతంలో.. కొండపైన భారీ వృక్షాలు.. వివిధ రకాల పండ్ల చెట్లు ఉండటంతో.. ఎలాంటి సమస్య రాలేదు. అయితే అటవీ విస్తీర్ణం తగ్గడంతో పాటు పండ్ల చెట్లు కనుమరుగువుతున్నాయి. దీంతో కోతులన్నీ ఇక ఆలయానికి చేరుకుంటున్నాయి. మొత్తం ఆలయ పరిసర ప్రాంతాల్లోనే కోతులు సంచరిస్తున్నాయి. 15 యేళ్లుగా కోతులు భక్తులను ముప్పితిప్పలు పెడుతున్నాయిఈ నేపథ్యంలోనే కోతుల ఆహారం కోసం గతంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. కొండ కింద.. మంకీ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాల పండ్ల మొక్కలు పెంచి.. వాటిని అక్కడికి తరలిస్తామని నిర్ణయం తీసుకున్నారు. కానీ, కేవలం బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. తరువాత ఇక్కడ ఎలాంటి పండ్ల మొక్కలు నాటలేదు. ఆహారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కోతులన్నీ కొండపైన తిష్ట వేస్తున్నాయి. కొండ సమీపంలో చెట్లు ఉన్నా.. అధికంగా కలప చెట్లు ఉంటాయి. పండ్ల చెట్లు లేవు. దీని కారణంగా భక్తులను వానరాలు టార్గెట్ చేస్తున్నాయి. కడుపు నింపుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నాయి. భక్తుల చేతిలో ఏం ఉంటే.. అవి ఎత్తుకొని వెళ్తున్నాయి.ఇక్కడ ప్రసాదం తీసుకోవాలంటే.. భక్తులు భయపడుతున్నారు. అంతేకాకుండా చాలా మంది భక్తులు స్వామి వారి సన్నిధిలో గడుపుతారు. వంట చేసుకోవడం కూడా ఇబ్బందిగా ఉంది. ఆహార పదార్థాలు ఎత్తుకొని వెళు న్నాయి. భక్తులు చేతిలో కర్ర పట్టుకొని కాపాలా ఉంటున్నారు. ముఖ్యంగా కొండగట్టులో ఎలాంటి పండ్ల చెట్లు లేకపోవడంతో భక్తులు ఇచ్చే ఆహారంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఎండకాలంలో.. ఆహారం కోసం మరింత ఇబ్బంది పడుతున్నాయి.అయితే, కొంత మంది భక్తులు.. ఇక్కడికి వచ్చి వివిధ రకాల పండ్లు ఇక్కడికి వచ్చి కోతులకు పెడుతున్నారు. కానీ.. అ ఏమాత్రం సరిపోవడం లేదు. సహజంగానే హనుమాన్ ఆలయాల వద్ద ఎక్కువగా కోతులు ఉంటాయి. వాటికి కడుపు నింపేందుకు అధికారులు ఎలాంటి ఆలోచన చేయడం లేదని భక్తులు మండిపడుతున్నారు. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి.. కోతుల జోన్ ఏర్పాటు చేసి వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు. ప్రతి రోజూ ఇక్కడ కోతులు రంగం చేస్తున్నాయి. ఒక్కసారి కోతి పైకి వస్తే.. చేతిలో ఏం ఉన్న వదిలిపెట్టి వెళ్తారు. గతంలో చేతిలో ఉన్న బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. వాటిని మళ్లీ కోతుల నుంచీ తీసుకోవడానికి భక్తులు నానా తంటాలు పడాల్సి వస్తుంది.అయితే.. మంకీ ఫుడ్ కోర్టును అభివృద్ధి చేసి, భారీగా పండ్ల మొక్కలు పెంచితే తప్ప కొంత మేరకు భక్తులకు బాధలు తప్పేలా లేవు. లేదంటే.. భయం.. భయంగానే భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ కోతులు ఎక్కువగా ఉన్నాయని, చేతిలో ప్రసాదం పట్టుకుంటే ఎత్తుకొని వెళ్తున్నాయని భక్తులు అంటున్నారు. చాలా జాగ్రత్తగా తీసుకొని వెళ్తున్నామని చెబుతున్నారు. పిల్లలు భయపడుతున్నారని అంటున్నారు. కోతుల కోసం.. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి, వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు.

# ప్రాణాలు తీస్తున్న కల్తీ కల్లు

**నిజామాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24,** తెలంగాణలో కల్తీ కల్లు ప్రవాహం.. విచ్చలవిడిగా సాగుతోంది. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నా కొన్ని ప్రాంతాల్లో అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.తెలంగాణలో ప్రధానంగా మూడు రకాల కల్లు అందుబాటులో ఉంటుంది. తాటి, ఈత, ఖర్జూర చెట్ల నుంచి కల్లు తీస్తారు. చెట్ల నుంచి సహజంగా ఉత్పత్తయ్యే కల్లుతో సమస్య ఏం లేదు. కానీ కొందరు రసాయనాలు ఉపయోగించి.. కృత్రిమంగా కల్లు తయారు చేస్తున్నారు. ముఖ్యంగా పెద్దగా నగదు ఖర్చు పెట్టలేని పేదలే కల్లు తాగుతూ ఉంటారు. అలాంటివారు కల్తీ కల్లు తాగి చిత్రవిచిత్రమైన లక్షణాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో జోరుగా 'కల్తీ' కల్లు మాఫియా రెచ్చిపోతోంది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి తయారు చేస్తున్న ఈ కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కల్లు అమ్మకాలపై తనిఖీలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాల్సిన తెలంగాణ అబ్కారీ శాఖలో కొందరు అధికారులు వారిచ్చే ముడుపులు పుచ్చుకుని నోరు మెదపడం లేదనే ఆరోపణలున్నాయి.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 30కి పైగా కల్లు దుకాణాలు నడుపుతున్నారు. కొంత మంది వ్యాపారులు.. రసాయనాలతో కల్లు తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ప్రాజోలమ్, వైట్ పేస్ట్ వంటి ప్రమాదకరమైన రసాయణాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ కల్తీ కల్లు తాగి శేరిలింగంపల్లి పరిధిలో వందల సంఖ్యలో అనారోగ్యానికి గురయ్యారు.ఇటీవల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కల్తీ కల్లు తాగి పలువరు ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై మీడియాలో వరుస కథనాలు రావడంతో.. రాష్ట్రవ్యాప్తంగా కల్తీకల్లు మూలాలపై యాక్షన్ మొదలు పెట్టింది అధికార యంత్రాంగం. అయితే రాష్ట్రమంతా కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు శాంపిల్స్ సేకరించినా.. శేరిలింగంపల్లి ఎక్సైజ్ అధికారులు మాత్రం ఇంత పెద్ద అంశాన్ని లైట్‌గా తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్టేషన్ సీఐ సెలవులో ఉండటంతో ఎస్ఐలే బాసులుగా మారిపోయారు. తాము చెప్పిందే చట్టం అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఇంచార్జ్ సీఐను సైతం పక్కనబెట్టి వారే పెత్తనం సాగిస్తున్నారని ఎక్సైజ్ శాఖలోనే చర్చ జరుగుతుంది.ఇంతమంది ప్రాణాలు ప్రమాదంలో ఉన్నా శేరిలింగంపల్లి ఎక్సైజ్ అధికారులు కల్తీ కల్లును ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదు..? తరచుగా తాము శాంపిళ్లు సేకరిస్తామని చెబుతున్న అధికారులు.. ఎన్ని షాపులపై కేసులు పెట్టారో తెలుపమంటే మాత్రం.. తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఈ అంశంపై కలగజేసుకుని.. క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకుని.. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మాస్టారు... మాస్టార్ మీరు సూపర్

మహబూబాబాద్, ఏప్రిల్ 24, తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు విద్యా కేంద్రాలుగా వెలుగొందిన ఈ బడులు, నేడు తల్లిదండ్రుల ప్రైవేట్ మోజుతో కళ తప్పిపోతున్నాయి. గ్రామంలో ఒకరు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమం పేరుతో లక్షలు గుమ్మరిస్తుంటే, మిగిలిన వారు కూడా అదే బాటలో పరుగెడుతున్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతున్నా.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పక్కింటి వారిని చూసి తమ పిల్లలను ప్రైవేట్ పరం చేసే ధోరణి సమాజంలో వేళ్లూనుకుపోయింది.నెలనెలా లక్షల జీతం తీసుకునే వారికి ఇది పెద్ద భారం కాకపోయినా, రోజువారీ కూలీ చేసుకునే పేద తల్లిదండ్రులకు ఇది పెను భారంగా అవుతుంది. అయినా.. సమాజంలో తమ స్థాయిని నిలబెట్టుకోవడం కోసం వారు అప్పులు చేసి మరీ ప్రైవేట్ బడులకు తమ పిల్లలను పంపుతున్నారు. "ఒక గొర్రె బాయిలో పడితే మిగతా గొర్రెలు కూడా దాని వెంటే వెళ్తాయి" అన్న చందంగా.. ఊరైనా పట్టణమైనా ఇదే పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఎలాగైనా తమ బడిని నిలబెట్టుకోవాలనే తపనతో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కళ్లెం వీరారెడ్డి చేసిన ప్రయత్నం మాత్రం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆయన తన ఉపాధ్యాయ బృందంతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. అక్కడ కూలీ చేస్తున్న తల్లిదండ్రులను కలుసుకొని.. చేతులు జోడించి వేడుకున్నారు. "అయ్యా, అమ్మా.. ప్రభుత్వ బడుల్లో ఎంతో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ప్రైవేట్ బడులకు వృథా చేయకండి. మీ పిల్లలను మా బడిలో చేర్పించండి. ఒకవేళ మా చదువులో లోపం ఉంటే మమ్మల్ని నిలదీయండి" అని ఆయన ఆవేదనగా విన్నవించారు.ప్రధానోపాధ్యాయుడి ప్రయత్నం.. ఆ మాటల్లోని నిజాయితీ కూలీల హృదయాలను తాకింది. వారిలో చలనం వచ్చింది. తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివిస్తామని వారు హామీ ఇచ్చారు. మొదటి రోజు 14 మంది విద్యార్థులు చేరగా.. రెండో రోజు మరో 17 మంది బడిలో అడుగుపెట్టారు. ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే ప్రభుత్వ బడుల రూపురేఖలు ఎలా మార్చవచ్చో వీరారెడ్డి నిరూపించారు. మిగిలిన ఉపాధ్యాయులు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేస్తే.. తెలంగాణలోని ఏ ప్రభుత్వ పాఠశాల కూడా విద్యార్థులు లేకుండా వెలవెలబోదు. పిల్లల నవ్వులు, చదువుల సందడితో ఆ బడులన్నీ కళకళలాడుతాయి

# కాళేశ్వరం..రెండో దశ విచారణ...

**కరీంనగం ప్రజాబలం ప్రతినిధి, ఏప్రిల్ 24,**ఆసియాలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రచారం చేశారు. అయితే నిర్మించిన మూడేళ్లకే ప్రాజెక్టులోని లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగాయి. అన్నారం బ్యారేజీ పిల్లర్ల వద్ద బుంగ పడింది. ఈ నేపథ్యంలో 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో విచారణకు ఆదేశించింది. విచారణకు కమిషన్‌ను నియమించింది.కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ రేపటి నుంచి రెండో దశ దర్యాప్తును చేపడుతోంది. మొదటి దశలో ప్రాథమిక విచారణ పూర్తి చేసిన కమిషన్, ఇప్పుడు మరింత లోతైన పరిశీలనకు సిద్ధమైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో సంబంధిత అంశాలపై దష్టి కేంద్రీకరించిన ఈ విచారణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటిపారుదల మంత్రి హరీశ్‌రావులకు నోటీసులు జారీ కానున్నాయి.ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తీసుకున్న నిర్ణయాలు, ఖర్చులు, ఒప్పందాలు, పనుల నాణ్యతను కమిషన్ సమగ్రంగా పరిశీలించనుంది. కోట్లాది రూపాయల బడ్జెట్‌తో నిర్మితమైన ఈ ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో, కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగించే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), విజిలెన్స్ విభాగం నివేదికలు ప్రభుత్వానికి అందాయి. ఈ నివేదికలను అధ్యయనం చేసిన తర్వాత, ఇంజనీర్లు, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం కేసీఆర్, హరీశ్‌రావులను విచారణకు పిలిచే అవకాశం ఉంది.కాళేశ్వరం విచారణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారనుంది. ప్రజలలో నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు ఈ దర్యాప్తు కీలకమని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. విచారణ ఫలితాల ఆధారంగా తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది.తాజాగా కాళేశ్వరం కమిషన్ విచారణతో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ సభకు బ్రేక్ పడే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. విచారణ నేపథ్యంలో కేసీఆర్, హరీశ్‌రావు కమిషన్ ఎదుట హాజరయ్యే అవకాశం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ పాతికేళ్ల సభకోసం విస్తృతంగా ఏర్పాటు చేస్తోంది. ఈ తరుణంలో విచారణ కమిషన్ రంగంలోకి దిగడం ఇప్పుడు రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. మరి కమిషన్ నిర్ణయాలు ఎలా ఉంటాయో చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ తదుపరి దశలో కీలక నిర్ణయాలు, బాధ్యుల గుర్తింపు రాష్ట్ర రాజకీయ, పరిపాలనా వాతావరణంపై గణనీయ ప్రభావం చూపనున్నాయి.

# ఆర్ట్స్ కాలేజీకు గుర్తింపు

హైదరాబాద్, ఏప్రిల్ 24, ఉస్మానియా విశ్వవిద్యాలయంకు సంబంధించి విశిష్టమైన చిహ్నంగా నిలిచిన ఆర్ట్స్ కళాశాల భవనం మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. దేశంలోని అత్యంత ప్రసిద్ధమైన ట్రేడ్‌మార్క్ భవనాల జాబితాలో ఈ చారిత్రాత్మక నిర్మాణం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముంబైలోని తాజ్ హోటల్ , స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాల తర్వాత.. ఈ ఘనత సాధించిన మూడవ కట్టడంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల నిలవడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం.మేరకు ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాన్ని ఓయూ పూర్వ విద్యార్థి , ప్రముఖ ట్రేడ్‌మార్క్ న్యాయవాది సుభజిత్ సాహా.. ఓయూ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ గారికి అందజేశారు. సుభజిత్ సాహా ఈ ప్రతిష్ఠాత్మక ట్రేడ్‌మార్క్ కోసం గత సంవత్సరం దరఖాస్తు చేశారు. ఈ ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ ద్వారా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రత్యేక అనుమతి లేకుండా ఆర్ట్స్ కళాశాల భవనం యొక్క చిత్రాన్ని ఎలాంటి వాణిజ్య ప్రకటనలలో గానీ, ఇతర వ్యాపార అవసరాలలో గానీ ఉపయోగించడానికి వీలు లేదు.ఆర్ట్స్ కళాశాల భవనం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిందని వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ అన్నారు. ఇప్పటికే ఎంతో గుర్తింపు , ప్రాధాన్యం కలిగిన ఈ భవనానికి ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ లభించడం మరింత గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులందరికీ గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ భవనం కేవలం ఒక నిర్మాణం కాదని, తరతరాల విద్యార్థుల జ్ఞాపకాలతో ముడిపడిన ఒక చారిత్రక సంపద అని ఆయన అభివర్ణించారు. భవిష్యత్తులో ఈ భవనం ప్రత్యేకతను కాపాడుకోవడానికి ఈ ట్రేడ్‌మార్క్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.మరోవైపు.. తెలంగాణ స్టార్టప్ వ్యవస్థకు ఊతమిచ్చే ౹-హబ్‌కు ప్రతిష్ఠాత్మకమైన 'బెస్ట్ కాన్సీవ్డ్ కోహోర్ట్ 2025' అవార్డు లభించింది. ఢిల్లీలో జరిగిన స్టార్టప్ మహాకుంభ్ 2025లో సెమీకండక్టర్ ప్రోగ్రామ్‌కు ౹-హబ్ ఈ అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డు ౹-హబ్ విజన్ , స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో దానికున్న నిబద్ధతకు నిదర్శనం.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

## - ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర.

## - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రైతులకు సూచించారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంతో పాటు రవినగర్(జంగుపల్లి), గొల్లపల్లి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వంలో దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. ఇలాంటి అనేక హామీలను ఇచ్చి పదేళ్లు ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇంతకీ ఇరవై ఐదేళ్ల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా? తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా? అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.బి

# మేఘ జాబ్ మేళా కు సకల సౌకర్యాలు కల్పించాలి ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి ఈ నెల 27వ తేదీన జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ హాల్లో జరిగే మెగా జాబ్ మేళా కార్యక్రమానికి వచ్చే యువతకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఏర్పాట్లుపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, పరిశ్రమ లు, వైద్య, విద్య, ఆర్టీఓ, సింగరేణి, జెన్కో అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి సుమారు పదిహేను వేల మంది నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సత్యనారాయణ రావు వివిధ శాఖల జిల్లా అధికారులకు కీలక సూచనలు చేశారు. ఏర్పాట్లుపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇప్పటి వరకు ఆన్లైన్ ద్వారా 7,624 మంది నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల నుండి జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం ఏర్పాటు తో పాటు మంచి నీరు, మజ్జిగ, అల్పాహారం తదితర ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్ప గ్రాండ్ లో మంచినీరు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సింగరేణి జీఎంకు సూచించారు. ఎందరో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఈ మహోన్నత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ సొంత కార్యక్రమంగా భావించి అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉపాధి లభించక చదువుకున్న యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని వారిని సన్మార్గంలో నడిపంచాల్సిన భాద్యత మనందరిపై ఉందని, యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం అవుతారని సూచించారు. వేసవి దృష్ట్యా అత్యవసర మందులు,



ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ ఏర్పాటుతో పాటు ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర బెడ్లు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకి సూచించారు. కొంతమంది ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారి కోసం అదే రోజు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. అందుకు కంపెనీల వారీగా ఖాళీలను తెలిపే విధంగా పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. టాస్క్ కంపెనీ ప్రతినిధులు ఒకరోజు ముందుగానే హైదరాబాద్ నుండి భూపాలపల్లికి వచ్చే అవకాశం ఉన్నందున సింగరేణి, జెన్కో అధికారులు వారికి వసతితో పాటు భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు.

87 కంపెనీలు వస్తున్నట్లు సమాచారం ఇచ్చారని, పెరిగే అవకాశముందని తగినట్లు ఏర్పాట్లు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాబ్ మేళా విజయవంతానికి గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయిలో ఎంపీడీవో, ఎమ్మార్వో, జిల్లా స్థాయిలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ కన్వీనర్ గా ఉంటారన్నారు. మనందరం సమష్టి బాధ్యతగా సమన్వయం చేసుకుంటూ ఇట్టి జాబ్ మేళాను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, జెన్కో సీఈ శ్రీ ప్రకాశ్, డిపిఓ నారాయణరావు, డిఆర్డీఓ నరేష్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, పరిశ్రమల జీఎం సిద్దార్థ, క్రీడల అధికారి రఘు,ఆర్టిఓ సంధాని, డీఈవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాష్ట్ర సమితి రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



ములుగు ప్రతినిధి : ఈ నెల 27న జరగబోయే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు ఏటూరునాగారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట చలో వరంగల్ బి.ఆర్.ఎస్ పార్టీ 25 వ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఏటూరునాగారం మండల అధ్యక్షులు గడదాసు సునీల్ ఆవిష్కరించారు. అనంతరం ఏటూరునాగారం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో పాలకులంతా తెలంగాణను అన్ని రంగాల్లో అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరు కోలేక తనకున్న అన్ని పదవులకు రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 27.04.2001 తేదీన ఏర్పాటు చేసిన పార్టీయే బి ఆర్ ఎస్ పార్టీ అన్నారు. 14 సంవత్సరాల పోరాటం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 10 సంవత్సరాల తెలంగాణ సుభిక్ష పాలన చేసిన నాయకుడు, తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో ఈనెల 27 న ఎల్కతుర్తి క్రాస్ రోడ్డు వరంగల్ లో జరిగే 25 సంవత్సరాల రజతోత్సవ సభను విజయవంతం చేయుటకు సబండ వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, ఎండి ఖాజాపాషా,,గండపల్లి నర్సయ్య, మేరుగు వేంకటేష్, దొడ్డ కృష్ణ, తాడూరి రఘు,మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నూతన ఆర్ ఓ ఆర్ చట్టం భూ భారతి పై రైతు అవగాహన సదస్సు కార్యక్రమం:

## ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ ప్రజాబలం ప్రతినిధి,** రైతులు భూ భారతి చట్టం పై రైతులకు పలు అంశాల పై అవగాహన కల్పించిన అధికారులు.భూముల సమస్యల పరిష్కారానికి రైతుల సందేహాలు నివృతి చేసిన అధికారులు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ

మీ భూములకు సంబంధించి ఈ ప్రభుత్వంలో రక్షణగా ఎలాంటి వివాదాలకు లేకుండా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింది.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలలో భూ భారతి పై అవగాహన సదస్సు నిర్వహిస్తుందిభూమి అంటే అదొక గౌరవం గతంలో భూముల వివరాలు గ్రామాల వారిగా ఉండేవి హద్దులతో సహా చెప్పే పెద్దనుషులు ఉండేవారు.. అప్పట్లో మాటకు అంత విలువ ఉండేది.సాదా కాగితాల మీద రాసుకొని అదే పత్రంగా ఉండేది తరువాత రిజిస్ట్రేషన్ ల ద్వారా జరిగింది.భూముల విలువ పెరిగిన తర్వాత ఒక్కో భూమి ఇద్దరు రిజిస్ట్రేషన్ చేసుకోవడం అన్నదమ్ముల పంచాయితీ భూముల మధ్య వివాదం గా మారింది.ధరణి వచ్చిన తరువాత భూముల పంచాయితీ పెరిగింది.భూ భారతి చట్టం ద్వారా భూమి ఎవరిదో సమగ్ర వివరాలతో భూ భారతి చట్టం తెచ్చాం. భూమి అమ్ముకోవాలన్న కొనాలన్నా పూర్తిగా వివరాలు ఉంటాయి.వారసత్వ భూముల్లో కూడా పంచాయతి ఉంది న్యాయబద్దంగా విచారణ జరిగిన తర్వాత భూమి సమస్యలు పరిష్కారం అవుతాయి.కోర్టుల వరకు పోవాల్సిన అవసరం లేదు. ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ ల ద్వారానే సమస్య పరిష్కారం అవుతుంది.ధరణి ద్వారా 30-40 లక్షల సమస్యల పై అప్లికేషన్లు వచ్చాయి.

భూ భారతి ద్వారానే ప్రతి భూమికి సమస్య పరిష్కారం అవుతుంది.ప్రభుత్వ భూములు ఎవరు కబ్జా చేసిన కలెక్టర్ దృష్టికి తీసుకురండి. ఎవరు కబ్జా రాజకీయాలకు అతీతంగా వాటిని కాపాడుతాం

వాటిని అభివృద్ధి కొరకు వాడతాం.ఎక్కడైనా పేదలకు భూములు దానం చేసి ఉండి. దానం చేసిన వారు మళ్ళీ గుంజుకున్న అన్నిటికీ రికార్డులు ఉంటాయి.భవిష్యత్ లో భూ పంచాయితీ లు ఉండవు.ప్రభుత్వం అనేక రకాలుగా ఆలోచన చేసి భూ భారతి తీసుకొచ్చింది.మీకు ఏ సమస్య ఉన్న అప్లికేషన్ పెట్టుకోండి.జూన్ 2 నుండి క్షేత్ర స్థాయిలో అమలు అవుతుంది.మీ సమస్య ఏమున్నా అధికారుల దృష్టికి తీసుకురండి. సమస్య పరిష్కారం అయ్యే విధంగా అధికారులు చొరవ తీసుకుంటారు.భవిషత్ లో సమస్యలు ఉండవు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హామీద్, సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పిఏసీ చైర్మన్ శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ భూములపై ఆరోపణలు నిరాధారమైనవే

## బద్వేలు మాజీ ఎమ్మెల్యే వైకాపా ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి




బద్వేలువైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆయన తమ్ముడు, కాశినాయన మండల జడ్పీటిసి సభ్యుడు సత్యనారాయణ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమపై వస్తున్న భూమి ఆక్రమణ ఆరోపణలను వారు ఖండించారు.

"చర్యలకు సిద్ధంగా ఉన్నాం"

"నా తమ్ముడు నాయనపల్లె పంచాయతీలో ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేశారని ఎవరికైనా నమ్మకమైతే, నిరూపిస్తే ఆ భూమిని వారికి వదిలేస్తాం," అని గోవిందరెడ్డి స్పష్టం చేశారు. అధికారులు విచారణ చేయాలన్న డిమాండ్ చేస్తూ, "జిల్లా కలెక్టర్ బద్వేలు, ఆర్డీవో ఎంక్వయిరీ జరిపి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు" అని తెలిపారు.

"రాజకీయ ప్రస్థానం, నిస్వార్థ సేవే మా బలం"

తన రాజకీయ జీవితాన్ని గుర్తుచేసుకున్న గోవిందరెడ్డి గారు, "మేము 20 సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉన్నాం. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, నా ఆధ్వర్యంలో 20 వేల ఎకరాల భూమి పంపిణీ జరిగింది. అందులో ఒక్క ఎకరా కూడా నా బంధువులకు గానీ, తమ్ముడికి గానీ ఇవ్వలేదు" అని తెలిపారు.

"మీడియా కథనాలు అసత్యం"

కొంతమంది మీడియా ప్రతినిధులు తప్పుడు కథనాలు ప్రచురించడం బాధాకరమని గోవిందరెడ్డి గారు అభిప్రాయపడ్డారు. "ఆంధ్రప్రభ విలేకరి మా తమ్ముడిని కలిసి '15 ఎకరాలు భూమి కావాలి' అని అడిగారు. మా తమ్ముడు ఆ అభ్యర్థనను తిరస్కరించడంతో, కక్షపూరితంగా కథనాలు రాస్తున్నారు," అని ఆరోపించారు.మా తమ్ముడు 300 ఎకరాలు ఆక్రమించాడని కొన్ని కథనాల్లో వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఎంక్వయిరీకి మేము సిద్ధంగా ఉన్నాం. నిజాయితీగానే ముందుకు సాగుతాం," అని గోవిందరెడ్డి స్పష్టం చేశారు

"నాకు ఒక ఎకరా డీకే టి భూమి కూడా లేదు"

"నాకు ఆక్రమించాలనే మతి ఉంటే, మా అన్నయ్య ఎమ్మెల్యేగా ఉన్న టైమ్‌లోనే చేసేవాడిని. కానీ నేడు నాకు ఒక డికెట్టు భూమి కూడా లేదు," అని సత్యనారాయణ రెడ్డి తేల్చిచెప్పారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరక ద్రుఢత్వం లభిస్తుంది ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి:**క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరక ద్రుఢత్వం లభిస్తుందనీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి ఆహ్వానిత వాలీబాల్ పోటీల ముగింపు వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు...

వారు మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం లభిస్తుందనీ తెలిపారు...మన ప్రాంతంలో అనేక మంది క్రీడాకారులకు నిలయంగా మారిందన్నారు..గతంలో విద్యార్థి దశలో ఉన్న సమయంలో కోర్టు లైన్ పోసే వాడినని అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు..

ఎల్లపుడూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహారాలు ఉంటాయని అన్నారు.. రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డి పోటీలు జిల్లా పరిదిలో తన వంతు ప్రోత్సాహకం ఉంటుందన్నారు... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాలకు పెద్ద పీట వేస్తున్నరని అందులో భాగంగా రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు...

గ్రామీణ ప్రాంతాల్లోనీ క్రీడాకారులను వెలికి తీయడానికి సీఎం కప్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు... క్రికెట్ ఆడటానికి అనుగుణంగా సిరిసిల్ల,వేములవాడ కోరుట్ల ప్రాంతాల్లో 5 ఎకరాల స్థలం కేటాయించడానికి ప్రభుత్వంకు లేఖ రాయడం జరిగిందన్నారు... క్రీడా రంగానికి మన జిల్లాకు అధికంగా నిధులు తీసుకువస్తానని పేర్కొన్నారు...

క్రీడాకారులు జీవితంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని ఎదుర్కొనే ధైర్యం ఎక్కువగా ఉంటుందన్నారు.. సిరిసిల్ల ప్రాంతంలో మంత్రుల చేతుల మీదుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగి%శీ%దన్నారు..

ఇటీవల అగ్రహారం డిగ్రీ కళాశాల కు బాలికల హాస్టల్ నిర్మాణం కోసం 10 కోట్ల మంజూరు చేయడం జరిగిందన్నారు.. రానున్న రోజుల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాను అన్నీ రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు...

# పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డికి మద్దతుగా పార్టీలో చేరుతున్న నాయకులు గాంధీభవన్ లో టిపిసీసీ చీఫ్ సమక్షంలో పార్టీలోకి డా.పొనుగోటి సోమేశ్వర్ రావు**

పాలకుర్తి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుంది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి క్యూ కడుతున్నారు. అందులో భాగంగా ఈ రోజు గాంధీ భవన్‌లో టిపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మెన్, నియోజకవర్గ స్థాయి నాయకుడు డా.పొనుగోటి సోమేశ్వర్ రావు ఆధ్వర్యంలో సుమారు 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టీపీసీసీ చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులలో తొర్రూరు మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్, రాయపర్తి మాజీ ఎంపిపి కంజర్ల ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీలు సొమ్లు నాయక్, రాజేందర్, భోజ్యా, బానోత్ శ్రీను, జాతోత్ నరేష్, పద్మా యకేందర్, రవి నాయక్, కృష్ణ మూర్తి, నరసింహా నాయక్, మైనారిటీ నాయకులు ఎం.డి. అన్వర్, యూత్ నుంచి వీరమనేని రాజు, సురేష్ నాయక్, గుగులోతు అశోక్, నెహ్రూ నాయక్, మహిళా విభాగం నుంచి కేతావత్ అనుజా, దారవత్ అనిత, విమల తదితరులు వున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు అన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు క్లీన్ స్వీప్ చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.... మా అత్త కోడళ్ళ ను తక్కువ అంచనా వేసి మాజీ మంత్రి ఎర్రబెల్లి ఇంకా.... ఏదో ఆశతో ఉన్నారని, వారు ఆశలు వదులుకుంటే వారికే మంచిదని చెప్పారు. ఈ చేరికలు ఇంకా... కొనసాగుతాయని, ఇంకా చాలా మంది నాయకులు రావడానికి సిద్ధంగా ఉన్నారు అన్నారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి నుండి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ ఉద్యోగుల పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన కుటుంబాలకు సంఘీభావంగా శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** జమ్మూ కాశ్మీర్లో పహాల్గంలో జరిగిన ఉగ్రదాడిలో అసువులు బాసిన అమాయక జనాల కుటుంబాలకు సంఘీభావంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కు సంబంధించిన రాజన్న ఆలయ ఉద్యోగుల యూనియన్ సభ్యులు వేములవాడలో శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీని ప్రధాన రహదారి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. తదనంతరం మరణించిన వారికి నివాళులర్పించి, ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగుల యూనియన్ సభ్యులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది, కాంటాక్ట్స్ సిబ్బంది మరియు ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల్లో కూరగాయల శ్రీనివాస్, వరి నరసయ్య, భాస్కర్, రమణమూర్తి, నరేందర్, శ్యామ్, రామ్ కిషన్ రావు, మైపాల్ రెడ్డి, లచ్చయ్య, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్తానీయులు...మీ దేశానికి వెళ్లిపోండి

## భారత్ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 కశ్మీర్‌లోని పహల్గాంలో భారత టూరిస్టులపై ఉగ్రదాడిపై భారత్ కఠినంగా స్పందిస్తోంది. తాజాగా గురువారం కేంద్ర ప్రభుత్వం పాకిస్తానీ జాతీయులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేసింది. అన్ని రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించింది. దేశంలో పాకిస్తానీ జాతీయులు భారతదేశం విడిచి వెళ్లాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారతీయులు పాకిస్తాన్‌కు వెళ్లద్దని కూడా ఓఇం సూచించింది. 27వ తేదీలోపు అందరూ వెళ్లాల్సి ఉంటుంది. పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తెస్తున్నారు. ఆ సమావేశంలో పాకిస్తాన్ జాతీయులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. పాకిస్తాన్ జాతీయులకు భారతదేశం జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 27 ఏప్రిల్ 2025 నుండి రద్దు చేశారు. పాకిస్తాన్ జాతీయులకు జారీ చేసిన వైద్య వీసాలు 29 ఏప్రిల్ 2025 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఈ లోపు అందరూ దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. ప్రకటించిన వీసా గడువు ముగిసేలోపు భారతదేశంలో ఉన్న అన్ని పాకిస్తానీ జాతీయులు దేశం విడిచి వెళ్లాలని ఓఇం ప్రకటన పేర్కొంది.

పాకిస్తాన్‌లోని అన్ని భారతీయులను ప్రభుత్వం వెంటనే తిరిగి రావాలని కోరింది. భారతీయ పౌరులు పాకిస్తాన్‌కు వెళ్లకుండ ఉండాలని ప్రభుత్వం సలహా ఇచ్చింది. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న భారతీయ పౌరులు కూడా వీలైనంత త్వరగా భారతదేశానికి తిరిగి రావాలని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉగ్రదాడికి పాకిస్తాన్ మద్దతు ఉందని స్పష్టం కావడంతో భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలికే వరకు పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం నిలిపివేయాలని నిర్ణయం తీసుకుంది. సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా మన దేశంలో పర్యటిస్తున్న పాకిస్థాన్ జాతీయులకు అనుమతుల రద్దు చేశారు. ఈ నిర్ణయాన్ని అమల్లోకి తెచ్చారు. భారత్‌లోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తోన్న ఆ దేశ సైనిక సిబ్బంది, అధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. దేశం వీడి వెళ్లేందుకు వారం రోజుల గడువు విధించారు. పాక్ దౌత్యవేత్తకు సమన్లు ఉన్నారు. భారత్ ఆదేశాలతో ఏ రకమైన వీసాపై భారత్ లో ఉన్నప్పటికీ వారంతా పాకిస్తాన్ తిరిగి వెళ్లిపోవాల్సి ఉంటుంది.

## మోడీ ఇంటర్నల్ టెర్రరిస్ట్

విజయవాడ, ఏప్రిల్ 24 ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రధాని మోదీపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఈ దేశ ఇంటర్నల్ టెర్రరిస్ట్ ప్రధాని నరేంద్ర మోడీ అని మండిపడ్డారు. ఇండియా నిఘా వ్యవస్థలను మోడీ వ్యవస్థలుగా మార్చారని ఆరోపించారు. విశాఖలో మీడియాతో మాట్లాడిన ఆమె.. ఇండియా ఇంటలిజెన్స్ అంతా మోడీ కోసం పని చేస్తోందని.. మోడీ కి వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ళ గొంతు నొక్కేందుకు నిఘా వ్యవస్థ పని చేస్తోందని ఆరోపించారు. పహెల్గాం ఘటన కు బాధ్యులు మోడీ,అమిత్ షానే అని విమర్శించారు. మోడీ,అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలన్నారు. పాలన చేసే హక్కు లేదు చౌకిదార్ మోడీ దేశానికి కాదు..కేవలం బీజేపీ కి మాత్రమేనని ఘాటు విమర్శలు చేశారు. జమ్మూ కశ్మీర్ లోని పెహల్గాంలో టూరిస్టులపై జరిగిన దాడిని దేశం మీద జరిగిన దాడిగా షర్మిల అభివర్ణించారు. దేశంలో శాంతి భద్రతలు గొప్పగా ఉన్నాయని మోడీ ఒక క్యాంపెయిన్ నడిపారని.. పెద్ద పెద్ద బోర్డులు పెట్టారన్నారు. ఇది చూసి ఏటా 2 కోట్ల మంది కాశ్మీర్ కి వెళ్తుంటారని.. ఇలాంటి ప్రాంతంలో సెక్యూరిటీ లోపం ఎందుకు అని షర్మిల ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి భద్రత లోపమేనన్నారు. టూరిస్టులపై కాల్పులు జరుపుతుంటే ఆర్మీ వాళ్ళు లేనే లేరని.. ఒక కన్ను వేసి ఉంటే వాళ్ళు వచ్చే వాళ్లు కాదన్నారు. ప్రొటెక్షన్ కోసం ఉండే సెక్యూరిటీ కూడా లేదన్నారు. ఇంతమంది చనిపోయారు అంటే ప్రభుత్వ లోపమేనని విమర్శించారు. ఉగ్రవాదం కంట్రోల్ చేయాల్సిన బాధ్యత బీజేపీ పై ఉందని షర్మిల అన్నారు. మోడీ చౌకిదార్ అని చెప్పుకుంటున్నారు. ఇదేనా చౌకిదార్ తనం అని ప్రశ్నించారు. ఈ ఘటనకు అమిత్ షా, మోడీ బాధ్యత వహించి రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఇంటలిజెన్స్ ఫెయిల్యూర్ ఇవ్వాళ దేశ నిఘా వ్యవస్థ దేశం కోసం పని చేయడం లేదు.. ఇండియా ఇంటలిజెన్స్ అంతా బీజేపీ కి వ్యతిరేకంగా ఉన్నా వల్ల మీద వాడుతున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ మీద వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ళ మీద వాడుతున్నారు .. ఇంత ఘోరంగా సెక్యూరిటీ విఫలం కావడం దారుణమన్నరా?. వీళ్లకు అధికారంలో ఉండే హక్కు లేదు.. వీళ్ళు దేశానికి చౌకిదార్ కాదు..బీజేపీ కి చౌకి దార్లు అని మండిపడ్డారు. ఈ దేశ దర్యాప్తు వ్యవస్థలను సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని.. నిఘా వ్యవస్థ బలం అంతా మోడీ కోసం పని చేస్తుందన్నారు. ఇది ముమ్మాటికి కేంద్రం తప్పిదమేనన్నారు. ఈ ఘటనలో ఒక ముస్లిం కూడా చనిపోయారు. దేశంలో ఉన్న ముస్లింలను చెడ్డవాళ్ళు అని చూపించే ప్రయత్నం చేస్తున్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని షర్మిల ఆరోపించారు. ఈ దేశంలో మతం పేరుతో యుద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఈ దేశంలోనే ఇంటర్నల్ గా భద్రత లేదు.. అన్ని మతాలు సమానం అనే పరిస్థితి లేదు.. ఇలాంటి పరిస్థితుల్లో తీవ్రవాదులకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఇంటర్నల్ టెర్రరిస్ట్ మోడీ.. మోడీ శ్రమ దేశ భద్రత కోసం పెట్టీ ఉంటే బయట వాళ్ళు చొరబడే పరిస్థితి లేదని విమర్శిచారు.

# కర్రెగుట్టలో భారీ ఎన్కౌంటర్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24** తెలంగాణ, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న కర్రెగుట్టలో భారీ ఎన్కౌంటర్ జరిగింది. కేంద్రబలగాలు,మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు తెలుస్తోంది. దీన్ని అధికారులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ఇక్కడ కీలకమైన మావోయిస్టు అగ్రనేతలు తలదాచుకున్నారనే సమాచారంతో భద్రతా దళాలు నిఘా పెట్టి ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న వెంకటాపురం, వాజేడు ఏజెన్సీ ఇప్పుడు భద్రతాబలగాల ఆధీనంలోకి వెళ్లిపోయింది. చాలా కాలంగా ఈ కర్రెగుట్టపై ల్యాండ్‌మైన్స్ పేలుతున్నాయి. ఆ ప్రాంతానికి వెళ్లాలంటేనే భద్రతా బలగాలు భయపడే పరిస్థితికి వచ్చింది. వ్యూహం మార్చిన భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. వెంకటాపురం మండలంలోని గుట్ట సమీపంలో ఉండే గ్రామాల్లోకకి బలగాలు చేరుకున్నాయి.ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతాదళాలు రెండు రోజుల నుంచి కర్రెగుట్ట లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇక్కడ హిడ్మా మడవి దళం సభ్యులు ఉన్నారని సమాచారం తెలుసుకున్న అధికారులు కూంబింగ్ నిర్వహించారు. కోబ్రా, డిఆర్జి,బస్టర్ ఫైటర్స్ అందరూ ఇక్కడ మాటు వేసి ఈ ప్రాంతాన్ని పూర్తిగా అష్టదిగ్బంధం చేశారు. ఈ కర్రెగుట్ట వైపునకు బలగాలు రాకుండా ఉండేందుకు మావోయిస్టులు చుట్టుపక్కల మందుపాత్రలు పెట్టారు. ఇవి తరచూ పేలుతున్న ఘటనలు చూసిన బలగాలు వాటిని నిర్వీర్యం చేస్తూ ముందుకు సాగుతున్నాయి. రోజుల తరబడి ఇక్కడ ఆపరేషన్‌లో ఉన్న సిబ్బందికి హెలికాప్టర్ ద్వారా ఫుడ్, వాటర్, మెడిసన్ సప్లై చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే చాలా మంది మావోయిస్టులు తలదాచుకుంటున్నారని సమాచారం అందుతోంది. అందుకే పూర్తిగా ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని పంతంతో భద్రతా దళాలు ఆపరేషన్ సాగిస్తున్నాయి. కర్రెగుట్టలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారాన్ని ముందుగానే తెలుసుకున్న బలగాలు అటుగా ఎవర్నీ వెళ్లనీయకుండా కట్టడి చేశారు. మావోయిస్టులకు మందులు, నీళ్లు, ఆహారం సరఫరా కాకుండా చేశారు. దాదాపు ఐదారు రాష్ట్రాల నుంచి బలగాలు ఈ ఆపరేషన్‌లో పని చేస్తున్నాయి. భారీ సంఖ్యలో బలగాలు అన్ని వైపుల నుంచి చుట్టు ముడితే తప్పించుకునే మార్గం మావోయిస్టులకు లేదని అధికారులు భావిస్తున్నారు. మరికొన్ని గంటల్లోనే కర్రెగుట్టలో ఉన్న మావోయిస్టుల వద్దకు చేరుకుంటామని అధికారులు చెబుతున్నారు.

## కేసీఆర్ కోసం జనం ఎదురుచూస్తున్నారు

## దానం నాగేందర్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24** భారత రాష్ట్ర సమితి ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ కు దాదాపుగా హ్యాండిచ్చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ కు అనుకూలంగా ఆయన మాట్లాడుతున్నారు. భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభ సక్సెస్ అవుతుందని ప్రకటించారు. కేసీఆర్ రాక కోసం జనం ఎదురు చూస్తున్నారని ఆయన అంటున్నారు. బహిరంగసభకు పెద్ద ఎత్తున వస్తారని చెప్పుకొచ్చారు. అదే సమయంలో ఐఏఎస్ స్మితా సభర్వాల్‌కూ ఆయన మద్దతు పలికారు. కంచ గచ్చిబౌలి విషయంలో స్మితా సభర్వాల్ చేసిన పోస్టులో తేడా ఏమీ లేదన్నారు. ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె పోస్టు చేయలేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ లోకి ఫిరాయించారు. ఆ పార్టీ తరపున సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసిన స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తనకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రివర్స్ అయ్యారు. అనర్హతా వేటు పడితే.. ఒక్క చాన్స్ దానంపైనే ఉంది. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ.. కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేశారు. ఈ విషయంలో ఆయనపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ పై ఒత్తిడి రావొచ్చన్న అంచనాలు ఉన్నాయి. అయినా ఆయన కాంగ్రెస్ కు దూరంగానే ఉంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కొత్త ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. కానీ ఆయన హాజరు కావడంలేదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లోనూ కనిపించడం లేదు. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రిని కూడా కలవలేదు. పార్టీ వీడేందుకే సిద్ధమయ్యే ఇలా మాట్లడుతున్నారంటూ మరో టాక్ వినిపిస్తోంది. అధికారంలో ఉన్న పార్టీ వీడి మరో పార్టీలోకి వెళ్లడం అనేది సాధారణంగా జరగదు. అదీ పార్టీ మరీ పట్టించుకోవడం లేదు, ఉన్నా ఉపయోగం లేదు అన్న సందర్భంలో తప్ప. ఇప్పుడు దానం విషయంలో అదే జరుగుతోందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఏదో ఆశించి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరితే తీరా, ఇక్కడ కూడా లైట్ తీసుకుంటారా.? అనే అసంతృప్తితోనే దానం ఇలా సహనం కోల్పోతున్నారు అనే వాదనలు ఉన్నాయి. ఇప్పుడు దానం నాగేందర్ రాజకీయంగా ఏం నిర్ణయం తీసుకుంటారన్నది కీలకంగా మారింది. మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్తే రానిస్తారేమో కానీ.. గతంలోలా ప్రాధాన్యం ఇవ్వరు. గ్రేటర్ ఎన్నికలు దగ్గర పడుతూండటంతో కాంగ్రెస్ పార్టీనే తన డిమాండ్లను నెరవేరుస్తుందని ఆయన నమ్మకంతో బెట్టు చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ఆయన పార్టీ కార్యక్రమాలకు రావడం లేదు అని కాంగ్రెస్ కూడా ఫీలవడం లేదు. రాకపోతే పోయారులే అనుకుని లైట్ తీసుకుంటున్నారు. దానం సిఫారసులను కూడా పట్టించుకోవడం లేదు.

# యుద్ధానికి సిద్ధంగా ఉండాలి పాకిస్తాన్ సైన్యానికి పిలుపు

లాహోరం, ఏప్రిల్ 24 పహల్గామ్ దాడి చేసిన పాకిస్థాన్‌లో పశ్చాత్తాపం కనిపించడం లేదు. భారత్ తీసుకున్న చర్యలకు ప్రతిగా దూకుడుగా వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు కనిపిస్తోంది. ఓవైపు ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతున్నా, రూపాయి అప్పు పుట్టే పరిస్థితి లేకపోయినా పట్టించుకోవడం లేదు. రేపటి దేశంలో జరిగే అనార్థాల గురించి ఆలోచించండం లేదు. భారత్‌పై ప్రతీకారంతో రగిలిపోతోంది. అందులో భాగంగా చర్యలకు సిద్ధపడింది. సింధు జలాల ఒప్పందం రద్దు చేసుకోవడం అంటే యుద్ధం ప్రకటించినట్టేనని పాక్ భావిస్తోంది. అందుకు తమ నుంచి కూడా దూకుడుగానే సమాధానం వస్తుందని చెబుతోంది. సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. వారికి ఉన్న సెలవులును రద్దు చేసినట్టు మీడియా కథనాలు వినిపిస్తున్నాయి. ఎలాంటి చర్యలకైనా సైన్యం సిద్ధంగా ఉండాలంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని సైన్యం చెబుతోంది.జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో మంగళవారం (22 ఏప్రిల్ 2025) జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకుంది. 1960 నాటి సింధు జల ఒప్పందాన్ని రద్దు సహా భారతదేశం అనేక చర్యలు తీసుకుంది. ఇది పాకిస్తాన్‌పై ప్రభావితమైంది. దీనికి ప్రతిగా భారతదేశానికి వాణిజ్య విమానాలు వచ్చేందుకు వీలు లేకుండా పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసివేసింది. భారత విమానాలు ఇకపై పాకిస్తాన్ గగన స్థలంలోకి ప్రవేశించడానికి అనుమతి లేదు. సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయాలని, దౌత్య సంబంధాలను తగ్గించాలని భారతదేశం తీసుకున్న నిర్ణయంతో పాకిస్తాన్ కలవరపాటుకు గురైంది. పాకిస్తాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ గురువారం (ఏప్రిల్ 24, 2025) ఉన్నత స్థాయి భద్రతా సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు.పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ బుధవారం రాత్రి ఒక ప్రైవేట్ టెలివిజన్ ఛానల్‌తో మాట్లాడుతూ, భారతదేశం తీసుకున్న చర్యను తొందరపాటు నిర్ణయంగా అభివర్ణించారు. పహల్గామ్ దాడి తర్వాత జెడ్డా నుంచి వెంటనే తిరిగి వస్తున్నప్పుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమానం పాకిస్తాన్ గగనతలం గుండా వెళ్ళలేదు. మరొక మార్గాన్ని ఎంచుకున్నారు అని అన్నారు. మంగళవారం (22 ఏప్రిల్ 2025) జెడ్డాకు వెళుతున్నప్పుడు, ప్రధానమంత్రి విమానం పాకిస్తాన్ గగనతలం గుండా వెళ్లారని తెలిపారు.భారతదేశం తీసుకున్న కఠినమైన చర్యలు పాకిస్తాన్‌కు చెమటలు పట్టిస్తున్నాయి. పాకిస్తాన్ స్టాక్ మార్కెట్‌లో క్షీణత వరుసగా రెండో రోజు కొనసాగుతోంది. గురువారం పాకిస్తాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రారంభమైన వెంటనే, ఐదు నిమిషాల్లోనే, బెంచ్‌మార్క్ (కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్) ఖూఇ-100 ఇండెక్స్ దాదాపు 2.2 శాతం అంటే 2,565 పాయింట్లు పడిపోయి 114,661.19కి చేరుకుంది.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య పాకిస్తాన్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిదారులు ఈ సమయంలో చాలా భయపడుతున్నారు. పాకిస్తాన్‌లో భయానక వాతావరణం కారణంగా, ప్రజలు తమ డబ్బును వెనక్కి తీసుకుంటున్నారు. అందుకే వరుసగా రెండు రోజులుగా క్షీణత ధోరణి కొనసాగుతోంది. పాకిస్తాన్ స్టాక్ మార్కెట్‌లో భారీ తగ్గుదల కనిపించింది. కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఖూఇ-100 ఇండెక్స్) 1,303.29 పాయింట్లు లేదా 1.10% తగ్గి 1,17,127.06 వద్ద ముగిసింది. ఇప్పుడు పెట్టుబడిదారులు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఇది పాకిస్తాన్‌లోని ప్రధాన స్టాక్‌లను కూడా ప్రభావితం చేస్తోంది. యునైటెడ్ బ్యాంక్ లిమిటెడ్ (జఃఒ), హబ్ పవర్ కంపెనీ (ఊఙఅ), హబీబ్ మెట్రో బ్యాంక్ (ఊఓః), మారి పెట్రోలియం (ఓంఖీఎ), ఎంగ్రో కార్ప్ (ఇఔఉఖీ) వంటి పెద్ద కంపెనీల షేర్లు పడిపోయాయి. పరిస్థితి ఇలా ఉన్నా సరే పాక్ తన వైఖరి మార్చుకోవడం లేదు.

## లిక్కర్ కేసులో మరో అరెస్ట్

విజయవాడ, ఏప్రిల్ 24 ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తున్న మద్యం కుంభకోణం కేసులో సిట్ దూకుడు పెంచింది. ఇన్నాళ్లూ నెమ్మదిగా సాగిన ఈ కేసు విచారణను మరింత స్పీడప్ చేస్తోంది. కీలక నిందితుడిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి అరెస్టుతో దర్యాప్తులో వేగం పెరిగింది. మరో నిందితుడిని కూడా అరెస్టు చేసింది. మద్యం అక్రమాల కేసులో రాజ్ కసిరెడ్డి తోడల్లుడు చాణక్యను సిట్ అరెస్టు చేసింది. ఆయన అసలు పేరు బూనేటి ప్రకాశ్. చాణక్యగా అందరికీ పరిచయం. మద్యం కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేసి ఒక చోటకు చర్చడంలో ఈయన పాత్ర కీలకంగా ఉందని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో ఏ1గా ఉన్న రాజ్ కసిరెడ్డిని రెండు రోజుల క్రితం సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఆయనను కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలించారు. ప్రాథమికంగా ఆయన్ని, మిగతా నిందితులను విచారించినప్పుడు దొరికిన సమాచారం మేరకు చాణక్యను లిఫ్ట్ చేశారు. మద్యం ద్వారా వచ్చిన క్యాష్‌ను తరలించడంలో ఈయనదే కీలక పాత్ర అని అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈయనకు దిలీప్ రెడ్డి, కిరణ్ అనే ఇద్దరు వ్యక్తులు సహకరించినట్టు చెబుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతోనే చాణక్యవ విదేశాలకు పారిపోయారు. దుబాయ్‌లో తలదాచుకుంటూ ఇక్కడ కేసు వివారలపై ఆరా తీశారు. తన స్నేహితులతో వివిధ మార్గాల్లో చాట్ చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇంతలో రాజ్ కసిరెడ్డి అరెస్టుతో చాణక్యకు భయంపట్టుకుంది. తన వంతు రావడం ఖాయమని తెలుసుకొని హైదరాబాద్ వచ్చేశారు. ఇక్కడ కోర్టుల ద్వారా ఉపశమనం పొందే ప్రయత్నాల్లో ఉండగానే సిట్ అధికారులు లాక్ చేశారు. ఈ కేసులో పెద్ద నెట్‌వర్క్ ఇన్వాల్వ్ అయినట్టు గుర్తించిన సిట్ అధికారులు రాజ్‌కసిరెడ్డిని మరింత లోతుగా విచారించాలని నిర్ణయించారు. అందుకే ఆయన్ని కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషనే వేశారు.

# జిల్లా పేరును రాష్ట్రస్థాయిలో నిలపడం అభినందనీయం



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** జిల్లా పేరును రాష్ట్రస్థాయిలో నిలపడం అభినందనీయం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో నిర్మల్ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు

నిర్మల్ లోని డిసీసీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిలను అభినందించారు. బైపీసీలో ఆల్ ఫోర్స్ కళాశాల చెందిన తహరిం,జోహా మహావీష్,సమ ఫిర్ దోస్,ఎస్ ఆర్ కళాశాల కు చెందిన శ్రీహర్ష 438,ఎంపీసి లో ఎస్ఆర్ కళాశాల చెందిన లక్ష్మీప్రసన్న 467 మార్కులతో రాష్ట్రస్థాయిలో నిలవడం ప్రశంసనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ద్వితీయ సంవత్సరంలోనూ మంచి మార్కులు సాధించి జిల్లా పేరును నిరపాలని,ఉత్తమ భవిష్యత్తు కోసం బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్ రాజేశ్వర్,పట్టణ అధ్యక్షులు నందెడపు చిన్ను, కొట్టే శేఖర్, గాజుల రవి కుమార్, జిషాన్ అలీ,ప్రశాంత్ తదితరులు ఉన్నారు

# నూతనంగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా శ్రీమతి ఎస్.శ్రీవాణి



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** నూతనంగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా శ్రీమతి ఎస్.శ్రీవాణి నియమితులై బాధ్యత స్వీకరించిన సందర్భంగా గురువారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పకూర్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అవినాష్ కుమార్ ఐపిఎస్,ఏ.ఎస్పీ భైంసా,రాజేష్ మీన ఐపిఎస్,ఏ.ఎస్పీ నిర్మల్,నిర్మల్ పట్టణ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మరియు నిర్మల్ గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీని నిండా ముంచిన బి.ఆర్.ఎస్.పార్టీ






**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** పది సం!!రాలు ఆర్టీసీ కార్మికుల శ్రమను దోచుకొని పనిబారంతో ఆర్టీసీ కార్మికుల ఆత్మ అత్యలకు గురిచేసి యూనియన్ నాయకులకు నోరెత్తకుండా చేసిన గులాబీ పార్టీ బి ఆర్ ఎస్ పార్టీని క్షమించే ప్రసక్తే లేదని అని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.అర్.రెడ్డి తెలిపారు.

గతంలో సమ్మె చేస్తే ఉద్యోగాలు పోతాయని బెదిరించి 33 మంది కార్మికుల ఆత్మ అత్యలకు కారకుడయ్యాడని 2017,2021 ఈ రెండు పి.ఆర్.సి.లు గత ప్రభుత్వమే ఇవ్వాలి.అది ఇవ్వలేక మొసలి కన్నీరు కారుస్తూ చలో వరంగల్ కు రావాలని మబ్య పెడుతూ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

అప్పుడే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసాము గవర్నర్ సహకరించడం లేదని కార్మికులను రెచ్చగొట్టి రాజభవన్ ను ముట్టడించేటట్టు చేసింది బి.ఆర్.ఎస్ ప్రభుత్వమే అని తెలియచేసారు.

విలీనం చేసినవాడు ఆపైంటెంట్ డే ఎందుకు ప్రకటించలేదని ఎద్దెవ చేశారు.కే.సి.ఆర్.కే.టి. ఆర్.హరీష్ రావ్,కవిత ఈ నలుగురు ఆర్టీసీ కార్మిక ధృహులే గులాబీల దొంగలే.

టి ఎం యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి బి అర్ ఎస్ సభకు రావాలని తప్పుడు ప్రకటన ఇప్పించారని ఆ ప్రకటన ఆయన చేయలేదని రాష్ట్రములొ ఉన్న ఎ డిపో కార్మికులు ఈ ప్రకటన నమ్మవద్దని ఎవరు ఆ సభకు వెళ్ళవద్దని టి.ఎమ్.యు.ఏ రాజకీయ పార్టీకి అనుబంధ యూనియన్ కాదని ఏ ఆర్ రెడ్డి ప్రకటించారు.

ఆర్టీసీ కార్మికులు వదంతులు నమ్మవద్దని మే 7 న తలపెట్టిన సమ్మెకు యూనియన్లకు అతీతంగా సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# సదాశివపేటలో మెగా జాబ్ మేళా...



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 24(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సదాశివపేట పట్టణంలోని శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు,ఇంటర్ డిగ్రీ పిజి ఇలా పై చదువులు పూర్తి చేసుకున్నటువంటి విద్యార్థులు ఎందరో నిరుద్యోగంతో బాధపడుతున్న తరుణంలో కంపెనీ వారిని సంప్రదించి గురువారం నాడు కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు,వారి చదువుకు తగినటువంటి ఉద్యోగంలో పదుల సంఖ్యలో సెలెక్ట్ అయ్యారు,ఈ ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగం సాధించినటువంటి నిరుద్యోగ విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు,జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్నటువంటి కంపెనీ వారికి కళాశాల యాజమాన్యం తరఫున శాలువాతో సన్మానం చేసి మేమేంటోను అందజేశారు,ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరవిందరావు , నర్సింలు, ప్రవీణ్ కుమార్, సతీశ్ కుమార్, రవీందర్, మహేష్ సౌజన్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలతో పాటే అదే బస్సులో ఇంచార్జీలు వెళ్లాలి

## ప్రతి వాహనానికి ఛలో వరంగల్ స్టిక్కర్ ఉండాలి

## కారుకు ఛలో వరంగల్ స్టిక్కర్ అంటించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 24(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రజతోత్సవ సభ ఛలో వరంగల్ కార్ స్టిక్కర్ లను కార్యకర్తల వాహనాలకు అంటించారు,సంగారెడ్డి నియోజకవర్గం నుంచి వరంగల్ రజతోత్సవ సభకు వెళ్ళే ప్రతి వాహనానికి ఛలో వరంగల్ స్టిక్కర్ ఉండాలని సూచించారు,ప్రజలకు ఇబ్బంది లేకుండా సభకు జనాలను తరలించాలని సంబంధిత కార్యకర్తలకు ఆదేశించారు,సభకు వెళ్ళే వాహనాలు,వాటి ఇంచార్జిలతో ఫోన్ లో మాట్లాడారు,కార్యకర్తలతో పాటే అదే బస్సు లో ఇంచార్జీలు వెళ్లాలి సూచించారు,కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, ఆర్ వెంకటేశ్వర్లు,పెరమళ్ళ నర్సింలు,గోవర్ధన్ నాయక్, సాబేర్,మల్లేశం,విఠల్, శ్రవణ్, విఠల్, జీవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా జైలును సందర్శించిన శ్రీమతి నేరెళ్ళ శారద



**మలక్‌పేట్ ప్రజాబలం ప్రతినిధి:**చంచల్ గూడా మహిళ జైలుకు మహిళా కమిషన్ చైర్ పర్సన్ శ్రీమతి నేరెళ్ళ శారద

కమిషన్ సభ్యులతో కలసి చంచల్ గూడా మహిళా జైలును సందర్శించిన చైర్ పర్సన్...

జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతులపై ఆరా...

మూలకత్, న్యాయసహాయం వంటి అంశాలపై జైలు సుపెరిటెండెంట్ వెంకట లక్ష్మీని వివరాలు అడిగితెలుసుకున్న శారద గారు...

ఖైదీలతో మాట్లాడిన చైర్ పర్సన్...

కేసు వివరాలు అడిగి తెలుసుకున్న చైర్ పర్సన్...

ఖైదీల స్వయం ఉపాధి పథకాలు, వైద్య సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్న చైర్మన్ పర్సన్ శారద

# బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలి

## అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ




**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:**కనీసం కేసీఆర్ కుటుంబం నుండి కాకుండా వేరే వెలమనైనా బీఆర్ఎస్ అధ్యక్షుడిని చేయగలరా?

కేటీఆర్ కి దమ్ముంటే పార్టీ అధ్యక్ష పదవి తీసుకొని బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తేవాలి

అధ్యక్ష పదవి చేపట్టిన రెండు సంవత్సరాలకే కాంగ్రెస్ పార్టీని రేవంత్ అధికారంలోకి తెచ్చారు

బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు?

బీఆర్ఎస్ పార్టీకి జాతీయ అధ్యక్షుడు ఎవరు?

కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంటో, నాన్ వర్కింగ్ ప్రెసిడెంటో ఆయనకే తెలియాలి

25 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీకా? టీఆర్ఎస్ పార్టీకా?

తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ లేదు

బీఆర్ఎస్ పార్టీ పుట్టి 2 ఏండ్లు అయింది

జనతా గ్యారేజ్ సినిమాలో ఓనర్ కొడుకు విలన్

బీఆర్ఎస్ పార్టీ జనతా గ్యారేజ్ అయితే పార్టీ ఓనర్ కొడుకు కేటీఆర్ విలనా?

కమలం పువ్వు కాడకి గులాబీ పువ్వును అంటగడుతున్నారుచంద్రబాబు మేము వేరువేరు కాదని కేటీఆర్ అంటున్నాడు

చంద్రబాబుకి మాకు సారూప్యత ఉందని కేటీఆర్ చెబుతున్నారుహెచ్‌సీయూ విషయంలో బీఆర్ఎస్ హ్యాండిల్స్ నుండి ఫోటోలు ఎందుకు డిలీట్ చేస్తున్నారో చెప్పాలి

# మున్సిపల్ ప్రజాధనాన్ని వృధా చేయకండి.

## ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ

అమలాపురం పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు చేసే ప్రయత్నంలో ఉన్న సందర్భంలో అమలాపురం పురపాలక సంఘ నిధులతో ప్రస్తుత రోడ్డు ప్రక్కన ఉన్న డ్రైనేజీ నిర్మాణ పనులను తక్షణమే ఆపాలని.. ప్రజాధనం వృధా కాకుండా చూడాలనీ.. పట్టణంలో కబ్జాలకు గురైన ఏడు చెరువుల వద్ద నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు కోరారు.

# వక్ఫ్ బోర్డుల పారదర్శకత, జవాబుదారీతనం అవసరం : ఢిల్లీ హజ్ కమిటీ చైర్మన్

ఖమ్మం ఏప్రిల్ అక్షర వీక్షణ సవరణ బిల్లు- 2004 ముక్కల సమాణ హక్కులను ఉల్లంఘిస్తోందన్న ఆరోపణలను తిప్పికొడుతూ, ప్రతిపాదిత చట్టం వక్స్ బోర్డులకు చాలా అవసరమైన పారదర్శకత, జవాబుదారీతనం తెస్తుందని ఢిల్లీ హజ్ కమిటీ చైర్పర్సన్ కౌసర్ జహాన్ అన్నారు. గత సంవత్సరం ప్రవేశపెట్టిన ఈ బిల్లు ద్వైపాక్షిక సుద్ధతును తీసుకువచ్చే ప్రయత్నంలో పార్లమెంటరీ సంయుక్త కమిటీ సిఫార్సు చేయబడింది. ప్రతిపాదిత సవరణలు చర్చ బోర్డుల నియంత్రణలో ఉన్న ఆస్తులు ప్రకటన, నియంత్రణను క్రమబద్ధీకరిస్తాయని. ప్రభుత్వం పేర్కొంది. గాగా వివరాలు ఈ బిల్లును వ్యతిరేగిస్తూ మస్లిం హక్కులకు భంగం కలిగిస్తున్నాయని పేర్కొన్నాయి. "ఈ సవరణలు అవసరం లేదని కొందరు సమితూ ప్రభుత్వ ఉద్దేశాల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు కానీ పకి బోర్డు ఏర్పాటు వెనుక ఉద్దేశాలను బబబారతనం పాదదర్శకతతో పూర్తిగా (హిందడానికి ఈ మార్పులు అవసరం" అని శ్రీమతి కౌసర్ జహాన్ అన్నారు. "వక్స్ బోర్డును వెనుకబడిన ముస్లింల సహాయం కోసం ఏర్పాటు చేశారు. కానీ బార్య కొందరు స్వార్థనలు దర్వినియోగం చేస్తున్నారు. ఉదా: ఢిల్లీలో మాజీ చీఫ్ అమానతుల్లాఖాన్ ఇపదలు జీతాలు కూడా నెల్లించలేదు. ఇతని స్నేహితులు, బంధువుల నియానురాలు కూడా జరిగాయి" అని బిల్లును గట్టిగా సమర్థిస్తూ శ్రీమతి కౌసర్ జహాన్ అన్నారు. "వర్ఫ్ బోర్డ సారూప్య వ్యక్తుల క్ష సరుపుతున్నట్లు చాలా మంది భావన, కావున సరైన షత్రాలు గుర్తింపును నిర్ధారించని ఆస్తుల సర్వేయర్ కలెక్టర్ గారి నిర్దిష్ట పాత్ర అవసరం. పరిపాలన ప్రమేయంతో, సరైన విధానం అనుసరించండి పత్రాలు స నిర్వహించబడతాయి" అని అమె చెప్పారు. ఈ చ చేయడానికి జిల్లా కలెక్టర్ లేదా అతనీరే నామినేట్ చేయబడిన వ్యక్తి (డిప్యూర్ కలెక్టర్ స్థాయి కంటే తక్కువ కాని) అధికారం కలిగి ఉంటారని ప్రతిపాదిస్తుంది. ఈ బిల్లు కేంద్రీకృత పోర్టల్ వ ఆస్తిని నమోదు చేయడానికి, మున్నవేతర మహిళా సభ్యులతో సహా కౌన్సిల్, రాష్ట్ర వర్క్ బోర్డ్ విస్తృత ఆధాంత కూర్పు, అలాగే రెవిన్యూ చట్టాల ప్రకారం ఇమ్యుటేషన్ కోసం వివరణాత్మక విధానాన్ని వివరిస్తుంది. ఏదైనా శక్తిని శక్తిగా వర్గీకరించే ముందు సంబంధిత అందరికీ తెలియజేయబడుతుంది.

# మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ



మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున తిరుమల హిల్స్ లోని రోడ్ నెంబర్ 1, 2 మరియు 3 ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు వెల్లుబుచ్చిన ప్రధాన సమస్యలు

1. రోడ్ నెంబర్ 2 లో దాదాపు రెండు మూడు సంవత్సరాల క్రితం రోడ్డుని తవ్వి తిరిగి రోడ్డుని నిర్మించలేదనీ, ఈ విషయం పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.
2. రోడ్ నెంబర్ 2 ప్రాంతంలో మెయిన్ రోడ్డు పైన ఎప్పుడు వాన కురిసిన మోకాల్లోతు నీళ్లు నిలబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. దీనికి ప్రధాన కారణం గోల్డెన్ టెంపుల్ జంక్షన్ నుంచి ఒకవైపు మాత్రమే పెద్ద డ్రైనేజ్ లైన్ వేయడం జరిగింది ఇక రెండవ వైపు పాతకాలం నాటి చిన్న సైజు పైపులు ఉన్న కారణంగా నీరు నిలుస్తున్నది. కావున రోడ్ నెంబర్ 2 దగ్గర డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.



3. రోడ్ నెంబర్ 2 మరియు 1 కూడలిలో ఎలక్ట్రికల్ స్తంభం ఒక వైపు వంగడం వలన ఎల్టి లైన్ వైర్లు పూర్తిగా కిందకి వేలాడుతున్నాయి. దీని కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కావున ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు స్పందించి ఎలక్ట్రికల్ లైన్ సరి చేయవలసిన అవసరం ఉన్నది.
4. రోడ్ నెంబర్ 2 మరియు 3 మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం వేస్తున్న కారణంగా తరచు పాములు వస్తున్నాయని చెప్పి స్థానికులు తెలియజేశారు.
5. తిరుమల హిల్స్ కాలనీ మొత్తంగా హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వారు ప్లాన్ మంజూరు చేసినప్పటికీ కాలనీలో రోడ్లు కుదించుకు పోయినాయి. ముఖ్యంగా రోడ్ నెంబర్ 3 పూర్తిగా ధ్వంసం అయిపోయింది. ఇక ఈ రోడ్లో తరచూ డ్రైనేజ్ సమస్య కూడా ఉత్పన్న మవుతున్నది. కావున మున్సిపాలిటీ వారు స్పందించి ముందుగా డ్రైనేజీ లైన్ వేసి తదుపరి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరడమైనది.



6. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని వీటికి వాక్సినేషన్ మరియు పునరుత్పత్తి జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరడమైనది. ఇక ఎప్పటినుంచో మణికొండ ప్రాంత ప్రజలందరూ కూడా ఈ వీధి శునకాలకు షెల్టర్ హోమ్స్ కట్టించాలని కోరుతున్నప్పటికీ మున్సిపాలిటీ వారు ఇంతవరకు ఈదిశగా చర్యలు చేపట్టక పోవడం శోచనీయం.
7. రోడ్ నెంబర్ 2 లో సెక్రటేరియట్ కాలనినీ కలుపుతూ వెనుక భాగంలో రోడ్డు నిర్మించ వలసి ఉండగా, దీన్ని ఎవరు పట్టించు కోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ రోడ్డు స్థలం అన్యక్రాంతం కాకముందే మున్సిపాలిటీ వారు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.
8. మణికొండ ప్రాంతంలో రోజుకి 450 ట్యాంకర్లు తిరుగు తున్నప్పటికీ ట్యాంకర్ బుక్ చేసుకున్న వారికి దాదాపు 12 గురించి 14 గంటల సమయం పడుతున్నది. ఇక కొంతమంది నిర్ణీత ధర కన్నా ఎక్కువ వసూలు చేస్తున్నట్టు స్థానికులు తెలిపారు. కావున హైదరాబాద్ వాటర్ వర్క్స్ వారు నీటి టాంకర్లను అనుచితంగా ఉపయోగించకుండా చూడవలసిన బాధ్యత ఉన్నది
9. వీధి దీపాలు తరచూ పాడై పోతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.
10. ఇంటి పన్ను వసూలు చేయడం పైన ఉన్న శ్రద్ధ ప్రజలకు అవసర నిమిత్తం మేలు తలపెట్టాలని మున్సిపల్ అధికారులకు లేదని, వీధి శుభ్రతపై అసలు స్పందనే లేదని తెలియ జేసినారు.



పై అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, బుద్ధోలు బాబు, ఉపేంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాస్ చారి, సంఘం శ్రీకాంత్, కిరణ్ యాలాల, సుమనళిని, చెరుకూరి బాలాజీ తది తరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

## ప్రతి గ్రామంలో తహాసీల్దారు రెవెన్యూ సదస్సులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 24:** భూభారతిలో సమస్యల పై అపీల్ చేసుకునే హక్కు ప్రతి ఒక్క రైతుకు ఉందని, అదేవిధంగా ప్రతి సమస్యను పరిష్కరించే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో కల్పించిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు.

గురువారం కీసర మండలంలోని చీర్యాల గ్రామంలో గల జయమోహన్ ఫంక్షన్ హాలు లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రైతుల సమస్యలకు పరిష్కారం తెలుపుతూ త్వరలోనే ప్రతి గ్రామంలో తహాసీల్దారు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరగుతుందని ఆ సదస్సులో మీయొక్క వ్యక్తిగత భూసమస్యలకు సంబంధించిన అప్లికేషన్లు ఇస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పాసు బుక్కులు రానివారికి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వడం , అలాగే పాసుబుక్కులలో తప్పులను సవరించడం ఈ భూభారతి చట్టం ద్వారా చేయవచ్చని తప్పనిసరిగారైతుల సమస్యలు తీరుస్తామని కలెక్టరు అన్నారు. రైతులు కోరుకుంటే లైసెన్స్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాపులను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ వాలిడేట్ చేసిన తరువాతే మీకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయని, దీని వల్ల ఎవరికి నష్టం జరగదని ఇంకా పకడ్బందీగా మీ భూసరిహద్దులు ఉంటాయని, అది కూడా రైతు ఒప్పుకుంటేనే భూ సర్వే చేస్తామని కలెక్టరు తెలిపారు. ధరణి వల్ల పిఒబి సమస్యలు చాలా ఉన్నాయని, భూభారతి చట్టంలో పిఒబి రద్దుచేసే అధికారం కల్పించడం జరిగిందన్నారు. ఈ భూభారతి చట్టంలో ప్రతి సంవత్సరం డిసంబర్ 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు, చేర్పులను ఆన్ లైన్ లో ప్రింట్ తీసి ప్రతి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారని అందువల్ల మీకందరికి మీమీ భూముల రికార్డుల వివరాలు తప్పక తెలుస్తాయని కలెక్టరు వివరించారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టరు తెలిపారు.

ఈ సదస్సులో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, జిల్లా గ్రంధాలయ సంస్థ కమిటి ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కీసర తహాసీల్దారు అశోక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన నిమ్మ రమేష్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 24 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధిలోని టేక్మాల్ మండలం ధనూర గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా నిమ్మ రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని అన్నారు రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ వరి కొనుగోలు కేంద్రాలకు తమ పండించిన ధాన్యాన్ని తీసుకొని వచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు, ఈ కార్యక్రమంలో, స్థానిక సొసైటీ డైరెక్టర్లు నరసింహారెడ్డి,పాపయ్య, కృష్ణ గౌడ్, మాజీ డైరెక్టర్ విద్యాసాగర్, సొసైటీ ఇన్చార్జి సీఈఓ సాయిలు, నాయకులు లాడేశ్రీశైలం, ఈర్నాల దుర్గయ్య రైతులు పాల్గొన్నారు....

# భారత పౌరుల మారణకాండ కు నిరసనగా కోర్టు విధుల బహిష్కరణ. దుండగులను కఠినంగా శిక్షించాలి.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం ప్రాంతంలో భారత పౌరులపై ముష్కరులు అమానుషంగా దాడి చేసి అనేక మందిని కాల్చి చంపడాన్ని నిరసిస్తూ, వారి దుశ్చర్యలను ఖండిస్తూ గురువారం వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించి, కోర్టు ప్రధాన ద్వారం ముందు నిరసన తెలిపి కోర్టు విధులను బహిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కటకం జనార్ధన్, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డిలు మాట్లాడుతూ ముష్కరుల దాడిని ఖండిస్తూ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, దుండగులను కేంద్ర ప్రభుత్వం గుర్తించి వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల గౌడ్, రేగుల దేవేందర్, కేశన్న గారి గోపికృష్ణ, కిషోర్ రావు, పొత్తూరి అనిల్ కుమార్, పురుషోత్తం, పిట్టల మనోహర్, పెంట రాజు, గోగికారి శ్రీనివాస్, నక్క దివాకర్, నాగుల సంపత్ కుమార్, గొంటి శంకర్, మాదాసు దేవయ్య, పిల్లి మధు, పంపరి శంకరయ్య, రేగుల రాజ్ కుమార్, గుజ్జే మనోహర్, బొజ్జ మహేందర్, కనికరపు శ్రీనివాస్, బీమా మహేష్ బాబు, గుడిపల్లి మహేష్, కనపర్తి రాజశేఖర్, ఉల్లెందుల అశోక్, నాగేంద్రబాబు, హరి, శంకర్, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, పావని, మమత, నైమా నా సారి పాల్గొన్నారు.

# జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, రాజ్యాంగ సంరక్షణ పాదయాత్ర

మెట్ పల్లి జగిత్యాల జిల్లా, మెట్ పల్లి మండలంలో బండలింగాపూర్, రాజేశ్వర్రావుపేట, చెర్ల కొండాపూర్ గ్రామం లలో గురువారం జై బాపు ,జై భీమ్ ,జై సంవిధాన్ లో భాగంగా రాజ్యాంగ సంరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, రాజ్యాంగం ఒక గొప్ప పవిత్ర గ్రంథమని, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ పౌరుని యొక్క బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరిమహేందర్ రెడ్డి, గండి హనుమాన్ చైర్మన్ ఏనుగు రామానుజన్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు జంగ స్వామి, గుడూరు తిరుపతి, ఏ భూమయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు జంగిట్ రాజేందర్ ,యూత్ జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల రాహుల్ , ఎన్ ఎస్ యు ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి విజయ్ , రాజు , మనోజ్, మల్లయ్య, విశ్వతేజ్ , సత్తయ్య, తుకారం , చిన్నారెడ్డి, మారు ప్రతాప్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయానికి బిర్లా ఏ1- ఆదాని సంస్థ2 లక్షల సిమెంట్ విరాళం.




**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు గాను బిర్లా -ఏ 1 సిమెంట్ సంస్థ ఆదాని గ్రూప్ ఆఫ్ కంపెనీస్ లో భాగమైన సందర్భంగా కంపెనీ యొక్క మొదటి సిమెంటు లోడ్ సుమారు రెండు లక్షల రూపాయల విలువ గల సిమెంట్ బస్తాలను ఆ సంస్థకు చెందిన అధికారులు గురువారం రోజున రాజన్న ఆలయ కార్యనిర్వాహణాధికారి కే. వినోద్ రెడ్డికి, అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మరియు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# గ్రామీణ కళలను, నాటక రంగ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. రాష్ట్ర కన్వీనర్ ఎల్లా పోశెట్టి.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ), తేదీ23-04-2025** బుధవారం రాత్రి 9 గంటలకు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పూడూరు గ్రామం నందు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి నాటక కళామండలి వారు శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్లా పోశెట్టి, ఉత్తర తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు, జిల్లా సాంస్కృతిక కళాశాల సమాఖ్య అధ్యక్షులు శ్రావణపల్లి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు వారాల దేవయ్య, పూడూరు గ్రామ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు నాటక మండలి అధ్యక్షులు, కార్యదర్శులు కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్ ఎల్లా పోశెట్టి మాట్లాడుతూ గ్రామీణ కళలను, నాటక రంగ కళాకారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రాచీన కళలను గ్రామీణ కళలను కనుమరుగు కాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అన్నారు. కళాకారులను గుర్తించి, ప్రభుత్వం గుర్తింపు కార్డులను అందజేసి వృద్ధ కళాకారులకు వృద్ధాప్య పింఛన్లను మంజూరు చేసి కళాకారుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన అన్నారు. గత 39 సంవత్సరాలుగా ప్రాచీన కళలకు జీవం పోస్తున్న కళాకారులకు, కళాభివందనాలు తెలియజేస్తూ ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి కూడా కళా రంగంపై ఆయనకున్న ప్రేమ ఎంత గొప్పదో అన్నారు. ఈ నాటక ప్రదర్శన తిలకించడానికి పూడూరు గ్రామ ప్రజలు, ఇతర గ్రామాల నుండి విచ్చేసిన కళాకారులు అందరికీ రాష్ట్ర కమిటీ పక్షాన హృదయపూర్వక కళాభివందనాలు తెలియజేస్తూ నాటక మండలి కళాకారులు ముమ్మాడి లక్ష్మీనారాయణ, చెలిమిల భాస్కరాచార్యులు, ముమ్మిడి రామస్వామి, ఎన్నారపు శ్రీనివాస్, అయ్యాపురం శ్రీహరి భాస్కరాచారి, వేముల మురళి, గోపాల కిషన్, కోట మురళి లింగారెడ్డి, హనుమాన్లతో పాటు 20 మంది కళాకారులు నాటక ప్రదర్శనలో కలలకు జీవం పోసి పాత్రలో లీనమై ఉన్నారని గుర్తు చేశారు.



# పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండించిన బోయినపల్లి సిపిఎం పార్టీ.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ మాట్లాడుతూ మినీ స్విట్జర్లాండ్ గా పేరు పొందిన కాశ్మీర్ పరిసర ప్రాంతం పహాల్గంలోని బైసరన్ ప్రాంతంలో భారతీయ పర్యాటకుల పై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో దాదాపు 26 మంది పర్యాటకులు చనిపోవడం చాలా బాధాకరమైన విషయం,ఉగ్రవాదుల చర్య ఏ రూపంలో ఉన్న రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. ఈ దేశాన్ని చిన్న భిన్నం చేయడానికి ఉగ్రవాదులు చేస్తున్న చర్యలకు ప్రతి చర్యగా ఉగ్రవాదులను తుద ముట్టించడానికి భారతీయ మిలిటరీ సైన్యాన్ని పెంచవలసిన అవసరం ఉందన్నారు. అందులో ఉన్న పోస్టులు భర్తీ చేయడం కూడా ఎంతైనా అవసరం అన్నారు. ఇదే సందర్భంలో ఒక భారతీయ పౌరుడిగా ప్రతి భారతీయుడు ఉగ్రవాద చర్యలను ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. ఈ సంఘటన పట్ల సిపిఎం పార్టీ పక్షాన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బోయినపల్లి గ్రామస్తులు బొడ్డు అంజయ్య, దాసరి అంజయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 24 :** మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన ఎ.వీరయ్య ను జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# వేములవాడ బిజెపిలో భారీ చేరికలు.

## రాబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యం. 100 అనుచరులతో కలిసి పార్టీలో చేరిన యువనేత బచ్చు వంశీకృష్ణ.







**వేములవాడ టౌన్, (ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలో బిజెపి పార్టీ దూకుడు పెంచింది. రాబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బిజెపి పార్టీ పనిచేస్తుంది. 17 వ వార్డు జాతర గ్రౌండ్లో యువ నాయకుడు బచ్చు వంశీకృష్ణ, రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సమక్షంలో, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో దాదాపు 100 మందికి పైగా యువకులు, మహిళలతో కలిసి భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతున్న నరేంద్ర మోడీ మరియు బండి సంజయ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ ని బలోపేతం చేయడానికి యువకులు పెద్ద ఎత్తున ఈ రోజు వంశీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీలోకి రావడం చాలా శుభసూచకం అన్నారు. పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ ఈరోజు చాలా శుభదినం. వేములవాడలో నా అధ్యక్షతన మొదటిసారిగా పార్టీలకు పెద్ద ఎత్తున యువకులు పార్టీలో చేరడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇకముందు కూడా ప్రతి వార్డులో బీజేపీ బలపడడానికి యువతను పార్టీలోకి ఆహ్వానించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కృష్ణస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్, వార్డు ముఖ్యులు గుంటి కనకయ్య, కొల మారుతి, పార్టీ పట్టణ కార్యదర్శి జవ్వాజి రాజశేఖర్, మరియు పట్టణ కమిటీ సభ్యులు 17వ వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో హిందూ ఉత్సవం సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ. పాకిస్తాన్ తీవ్రవాదుల దిష్టిబొమ్మ దహనం.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ( ప్రజాబలం ),** కాశ్మీర్లోని పహల్గాం కి విహారయాత్రకు వెళ్లిన వారిని మతం పేరుతో విభజించి, ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకొని హతమార్చిన ఉగ్రవాదుల పిరికిపంద చర్యను ప్రపంచమంతా ఖండిస్తుందని ఎల్లారెడ్డిపేట మండలంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు పేర్కొన్నారు.

ఇప్పటికే చిప్ప చేత పట్టుకొని ప్రపంచమంతా తిరుగుతున్న పాకిస్తాన్ ఈ దుశ్చర్యకు పాల్పటం సిగ్గు మాలిన చర్య అని, భారత ప్రభుత్వం నుండి దీనికి పర్యవసనాలు చాలా తీవ్రంగా ఉంటాయని హిందూ ఉత్సవ సమితి సభ్యులు హెచ్చరించారు.

ఈ ఉగ్రదాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు, ప్రగాఢ సానుభూతి, శ్రద్ధాంజలి గడిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని హిందూ ఉత్సవ సమితి సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 24, ( ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం పుల్కల్ మండల పరిధిలోగల ముదిమాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రుల సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విట్టల్,ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది,ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విట్టల్, మాట్లాడుతూ పాఠశాలలకు సెలవులు రావడంతో తిరిగి జూన్ 12న, ప్రారంభం అవుతాయని తెలిపారు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం 5 గంటలకే నిద్ర లేపి, 6 గంటల వరకు ప్రతిరోజు చదివించి, పిల్లలు ఉన్నత చదువులకు ఎదగడానికి ప్రోత్సహించాలని సూచించారు, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని, ఎందుకంటే ప్రైవేట్ కార్పొరేటర్ విద్యాసంస్థల్లో పిల్లలకు వేలకు వేలు ఫీజులు చెల్లించి అక్కడ చదివిస్తారు, కానీ ప్రైవేట్ కార్పొరేట్ విద్య స్థలాల్లో పిల్లల చదువు వారికి అక్కడ బాగుండదు ఎందుకంటే మేము కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని , ఈరోజు మీ పిల్లలకు మేము చదువు చెప్పడానికి దూర ప్రాంతాల నుండి వస్తున్నామని అన్నారు, ప్రస్తుత పరిస్థితుల విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా పిల్లలను చెరువుల వద్దకు కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తమ పిల్లల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు, ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు....

# విజయ మిల్క్ యూనిట్ లో మానవహారం

విజయవాడ పహల్గం ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ విజయవాడ లోని కృష్ణ మిల్క్ యూనియన్ (విజయ) మిల్క్ ఫ్యాక్టరీలో మానవహారం ఏర్పాటు చేసారు. ఈ మానవహారంలో పాల్గొని ఉగ్రవాదులు దాడిని ఎంపీ కేశినేని శివనాథ్ ఖండించారు.ఎంపి మాట్ఆడుతూ పహల్గం ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఈ దాడి పాకిస్తాన్ ఆధ్వర్యంలోనే జరిగింది. ఉగ్రవాదులు దాడుల్లో గాయపడిన వారికి సానుభూతి తెలియజేయడంతోపాటు మృతి చెందిన వారికి సంతాపం ప్రకటించారు. ఇలాంటి అమానుషమైన దాడులకు పాల్పడిన వారిని ప్రేరేపించిన వారిని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుంది. దేశ ప్రజలందరూ ఐక్యమత్యంగా ఒకటై ఉంటున్న సమయంలో విభేదాలు సృష్టించటానికి ఉగ్రవాదమూకలు ఈ దాడికి పాల్పడ్డారు. దేశ ప్రజల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న అరాచక శక్తుల్ని కఠినంగా శిక్షించాలని దేశ ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుకుంటున్నారని అన్నారు.దేశాభివృద్ధిని చూసి ఓర్వలేక పాకిస్తాన్ ఆధ్వర్యంలో ఉగ్రవాదులు ఈ ఉన్మాద చర్యకు పాల్పడ్డారని అన్నారు.ఈ కార్యక్రమంలో అర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి పతావుల్లా, రాష్ట్ర తెలుగు మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఆషా, రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), మేనేజింగ్ డైరెక్టర్ ఈశ్వర్ బాబు పాల్గొన్నారు.

